www.vishalabharati.com
epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
11.10.2024
సంపుటి:2 సంచిక:341

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

## సాహిత్యంలో హాన్ కాంగ్‌కు నోబెల్ పురస్కారం

- జీవితంలోని దుర్బలత్వం,చారిత్రక విషాదాల రచనలకు గాను బహుమతి
- ఇప్పటికే వైద్య,రసాయన, భౌతిక శాస్త్రాల్లో నోబెల్



**విశాలభారతి,వెబ్ డెస్క్:**

సాహిత్యంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి దక్షిణ కొరియా రచయిత్రి హాన్

..మిగతా 2 లో

## రతన్ టాటా అంత్యక్రియలు పూర్తి

- ఎలక్ట్రిక్ విధానంలో అంత్యక్రియలు
- మహారాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో
- చివరి చూపుకి వేల సంఖ్యలో నేతలు, ప్రముఖులు, అభిమానులు, ప్రజలు





**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

పారిశ్రామిక దిగ్గజం, టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు పూర్తయ్యాయి. ప్రజల సందర్శన కోసం టాటా పార్థివదేహాన్ని ఆయన నివాసం నుంచి ఎన్‌సీపీఏ గ్రౌండ్‌కు తరలించారు. అనంతరం గురువారం సాయంత్రం అక్కడ నుంచి వర్లీ వరకు కొనసాగిన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు. వర్లీ శ్మశానవాటికలో రతన్ టాటా పార్థివదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించింది. అయితే, పార్సీ మతస్థుడైనప్పటికీ ఎలక్ట్రిక్ విధానంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

**భిన్న సంప్రదాయం..**

హిందూ, ముస్లింల మాదిరి కాకుండా పార్సీల అంత్యక్రియలు భిన్నంగా ఉంటాయి. మానవ శరీరాన్ని ప్రకృతి బహుమతిగా భావిస్తారు. అందుకే శరీరాన్ని తిరిగి ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తారు. దహనం, ఖననం చేయడం వల్ల ప్రకృతి వనరులైన నీరు, గాలి, అగ్ని కలుషితం అవుతాయని జొరాస్ట్రియన్‌ల విశ్వాసం. అందుకే ప్రత్యేక విధానంలో అంత్యక్రియలు చేస్తారు. అంత్యక్రియలకు ముందు పార్సీ సంప్రదాయం ప్రకారం ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం పార్థివదేహాన్ని అంత్యక్రియల కోసం నిర్దేశించిన ప్రత్యేక ప్రదేశానికి తీసుకెళ్తారు. దాన్ని టవర్ ఆఫ్ సైలెన్స్ లేదా దఖ్మా అని పిలుస్తారు. రాబందులు వచ్చి తినేందుకు వీలుగా ఆ ప్రదేశంలో పార్థివదేహాన్ని ఉంచుతారు. ఈ మొత్తం పద్ధతిని దోఖ్మేనాశీని గా పేర్కొంటారు. మన దేహం ప్రకృతి నుంచి వచ్చింది అలాగే తిరిగి ఐక్యమవ్వాలని వీరి ఆశయం.

రాబందులు లేకపోవడమూ..

పార్సీల సంప్రదాయం ఇలా ఉన్నప్పటికీ.. మారుతున్న పర్యావరణ పరిస్థితులు, రాబందుల సంఖ్య తగ్గిపోవడం వంటి సమస్యల కారణంగా దఖ్మా పద్ధతిలో అంత్యక్రియలు కష్టంగా మారింది. దీంతో సోలార్ లేదా విద్యుత్ విధానంలో దహన వాటికల్లోనే పార్సీలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నీరు, అగ్ని, నేల కాలుష్యం కాకుండా జొరాస్ట్రియన్ నియమాలకు అనుగుణంగానే అంతిమ సంస్కారాలు కొనసాగిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయి సంస్థను నెలకొల్పి ఎందరికో ఉపాధి అవకాశాలు

..మిగతా 2 లో

### వీడ్కోలు మిత్రమా

- మాజీ ప్రేయసి, బాలీవుడ్ నటి సిమి గరెవాల్



రతన్ టాటా మరణం పట్ల ఆయన మాజీ ప్రేయసి, బాలీవుడ్ నటి సిమి గరెవాల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.మీరు ఇక లేరని అంటున్నారు. ఆ లోటు భరించడం చాలా కష్టం.. వీడ్కోలు మిత్రమా' అంటూ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటి అయిన సిమి గరెవాల్ గతంలో రతన్ టాటాతో ప్రేమలో పడ్డారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. రతన్ టాటాతో సన్నిహితంగా మెలిగినట్లు తెలిపారు. ఆ తర్వాత విడిపోయామని, అప్పటి నుంచి మంచి స్నేహితులుగా కొనసాగుతున్నట్లు వెల్లడించారు



## అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

- ట్యాంక్ బండ్ పై అధికార లాంచనాలతో నిర్వహణ
- అమరుల స్థూపం వద్ద మంత్రి సీతక్క, విమలక్క పూజలు
- ఆకట్టుకున్న లేజర్ లైట్ షో



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

భాగ్య నగరంలో సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ట్యాంక్ బండ్ పై ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకగా బతుకమ్మ సంబురాలు జరిగాయి. తీరొక్క పూలతో మహిళలు వేడుకలు చేసుకున్నారు. బతుకమ్మలతో అమరుల స్థూపం దగ్గర తొలిపూజ చేశారు. మంత్రి సీతక్క, విమలక్క తొలి పూజ నిర్వహించారు. అమరుల స్థూపం నుంచి ట్యాంక్ బండ్ వరకూ ర్యాలీ జరిగింది. లేజర్ లైట్ షో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రంతో పాటు విదేశాలలోను బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయని చెప్పారు. ఆత్మీయతతో, భక్తి శ్రద్ధలతో

..మిగతా 3 లో

## బెంగళూరు తరహాలో హైదరాబాద్‌లో 'హైడ్రా' చర్యలు

- మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో హైడ్రా కమిషనర్ వీడియో సమావేశం
- ప్రజలందరి భాగస్వామ్యంతోనే చెరువులకు పునరుజ్జీవనం
- పర్యావరణానికి చెరువలే ఆదేరువు
- హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ప్రజలందరి భాగస్వామ్యంతోనే చెరువులకు పునరుజ్జీవనం కల్పిస్తామని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ స్పష్టం చేశారు. పర్యావరణానికి చెరువలే ఆదరువు అని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణకు చెరువు తల్లి లాంటిదని ఆయన అభివర్ణించారు. తాగు, సాగు నీరందించే చెరువులు పట్టణీకరణతో ప్రభావాన్ని కోల్పోయాయన్నారు. చాలా చెరువులు కనుమరుగైతే.. ఉన్నవి కొన్ని

..మిగతా 3 లో



## రేవంత్ ను మాదిగలు నమ్మరు

- ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే 11వేల టీచర్ పోస్టులు భర్తీ
- గ్రూప్ 1, గ్రూప్ 2కు కచ్చితంగా అమలు చేయాలి
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మాదిగలను నమ్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రకటనలు చేసినా, నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకూ వర్గీకరణ వర్తింపజేస్తామని చెప్పి, అమలు చేయకుండానే టీచర్ పోస్టులు భర్తీ చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి శాసనసభలో చెప్పిన మాటలకే విలువలేదని విమర్శించారు. శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తామంటే అనుమతి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వమే కాదు.. రేవంత్ ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే

..మిగతా 3 లో



## ఒకే దేశం, ఒకే ఎన్నికలు ప్రణాళికను రద్దు చేయండి

- కేరళ అసెంబ్లీ తీర్మానం

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రణాళికను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేరళ కోరింది. ఈ ప్రతిపాదన అప్రజాస్వామ్యమని ఆరోపించింది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. కేరళ అసెంబ్లీ ఈ మేరకు గురువారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. కేరళ సీఎం పినరయి విజయన్

..మిగతా 2 లో



## తెలుగుదేశం నాకు రాజకీయ భిక్ష పెట్టింది

- మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఇప్పుడు రాజకీయాలు వద్దు వద్దు అంటూనే తెలుగుదేశం పార్టీ నాకు రాజకీయ భిక్ష పెట్టిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఇటీవలే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసిన అనంతరం ఆయనను మీడియా ప్రతినిధులు సంప్రదించారు. తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారా.? అని అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా

..మిగతా 2 లో



## కొండా సురేఖపై కేటీఆర్ పరువునష్టం

- క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్
- తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా సురేఖ కామెంట్లు
- కోర్టుకు తెలిపిన కేటీఆర్
- ఇప్పటికే నాగార్జున పిటిషన్
- సురేఖ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్.. మంత్రి

..మిగతా 2 లో

## రేవంత్ అబద్ధాలు ఆపు..

- బీఆర్ఎస్ హయాంలో లక్షా 60 వేల ఉద్యోగాలు ఇవ్వలేదా?
- నియామాక పత్రాల పంపిణీని రాజకీయంగా వాడుకుంటారా?
- రేవంత్ రెడ్డి మార్కెటింగ్ చేసుకుంటున్నారు
- 2 లక్షల ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయడం లేదు
- బీఆర్ఎస్ నేత వినోద్ కుమార్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షా 60 వేల ఉద్యోగాలు కేసీఆర్ భర్తీ చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పగలరా..? అని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ సవాల్ విసిరారు. సీఎం రేవంత్ ఆయన మంత్రివర్గ సహచరులు కేసీఆర్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరగనట్టు మాట్లాడడం సరికాదన్నారు వినోద్ కుమార్. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయుల నియామకాల ప్రోగ్రాంను సీఎం రాజకీయ వేదికగా వాడుకున్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల ఉద్యోగాలు తీసేస్తే మీకు ఉద్యోగాలు వచ్చాయని రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులనుద్దేశించి అన్నారు. కేసీఆర్ హయాంలో రికార్డు స్థాయిలో ఉద్యోగాలు ఇచ్చాం. మేము సరిగా చెప్పుకోలేకపోయాం. మార్కెటింగ్‌లో రేవంత్ రెడ్డిని మించినోడు లేడు. తన రియల్ ఎస్టేట్ వ్యాపారి అని రేవంత్ తనకు తానే ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నారు. అలా చెప్పుకున్న వారు మార్కెటింగ్‌లో ఎలా ఉంటారో తెలియదా..? అని వినోద్ కుమార్ పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో లక్షా 60వేల ఉద్యోగాలు ఇచ్చాము. ఈ విషయం భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌కు తెలియకపోతే వారు మంత్రులుగా ఉండటానికి అనర్హులు. కేసీఆర్ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి అని మంత్రులు అడుగుతున్నారు.. వారికి తెలియదా..? ప్రభుత్వం వద్ద లెక్కలు లేవా..? ఇప్పటి వరకు ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయో నిర్ధారించారా..? నిర్ధారిస్తే ఆ వివరాలు రేవంత్ రెడ్డి చెప్పాలి. నిన్న మీరు ఇచ్చిన ఉపాధ్యాయ నియామకాలు కూడా సెప్టెంబర్ 6, 2023 నాడు ఇచ్చిన నోటిఫికేషన్‌కు కొనసాగింపే. కేవలం ఆరు వేల ఉద్యోగాలు నోటిఫికేషన్‌లో

..మిగతా 2 లో

# రతన్ టాటా అంత్యక్రియలు పూర్తి

మొదటి పేజీ తరువాయి

కల్పించి, తన సంపాదనలో 60 శాతానికిపైగా పేదల సంక్షేమానికి ఖర్చు పెట్టిన టాటా గ్రూప్ మాజీ ఛైర్మన్ రతన్ నావల్ టాటా(86) బుధవారం రాత్రి మరణించారు. రెండు దశాబ్దాలకు పైగా టాటా గ్రూప్‌నకు అధిపతిగా ఉన్న రతన్ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో దక్షిణ ముంబైలోని బ్రీచ్ క్యాండీ హాస్పిటల్‌లో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించి బుధవారం రాత్రి 11.30 గంటలకు తుది శ్వాస విడిచారు. న్యూయార్క్‌లోని ఇథాకాలోని కార్నెల్ యూనివర్సిటీలో చదువుకున్న రతన్ టాటా 1962లో భారత్‌కు తిరిగి వచ్చి కుటుంబాన్ని పోషించడానికి ఓ దుకాణంలో పనిచేశారు. డిసెంబర్ 28, 1937న నావల్ టాటా, సూని టాటా దంపతులకు పార్సీ జొరాస్ట్రియన్ కుటుంబంలో రతన్ టాటా జన్మించారు. రతన్‌కు జిమ్మీ నావల్ టాటా, నోయెల్ టాటా అనే సోదరులున్నారు. రతన్ టాటా, ఆయన తమ్ముడు జిమ్మీ ముంబయి డౌన్‌టౌన్‌లో నివసించే అమ్మమ్మ నవాజ్‌బాయి దగ్గర పెరిగారు. ఆయన పార్థివదేహాన్ని కడసారి చూసేందుకు వేల సంఖ్యలో నేతలు, ప్రముఖులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు

**రతన్ టాటా వారసుడెవరు?**

పారిశ్రామిక దిగ్గజం, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా బుధవారం మరణించారు. ఆయన మరణంతో.. దశాబ్దాల చరిత్ర కలిగిన టాటా గ్రూప్‌లో రతన్ టాటా శకం ముగిసినట్లు అయింది. దీంతో రతన్ టాటా వారసుడు ఎవరనే ఓ చర్చ అయితే ప్రారంభమైంది. టాటా గ్రూప్ ఛైర్మన్‌గా ఆ సంస్థ వ్యాపారాన్ని 4 బిలియన్ల డాలర్ల నుంచి 100 బిలియన్ల డాలర్లకు రతన్ టాటా తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో అంత సత్తా ఉన్న వ్యక్తి టాటా ఫ్యామిలీలో ఎవరనే అంశం తాజాగా తెరపైకి వచ్చింది. ఆ క్రమంలో రతన్ టాటా సవతి సోదరుడు నోయెల్ టాటా పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఆయనకు ఈ టాటా గ్రూప్‌లో పని చేసిన అనుభవం ఎంతో ఉంది. ప్రస్తుతం టెంట్ అండ్ టాటా ఇంటర్నేషనల్‌కు ఛైర్మన్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు. నోయెల్ టాటా నాయకత్వంలో ఈ గ్రూప్ అత్యున్నత శిఖరాలు అందుకునే అవకాశముందనే ఓ చర్చ సాగుతుంది. ఇక నోయెల్ టాటా పిల్లలు మాయ, నెవిల్లే, లేహ్ టాటాలు సైతం ఇదే టాటా గ్రూప్‌లోని వివిధ రంగాల్లో కీలక పదవుల్లో ఉన్నారు. లేహ్ టాటా. ఆమ వయస్సు 39 సంవత్సరాలు. టాటా ట్రస్ట్‌లోని కీలక బాధ్యతలను ఆమె పర్యవేక్షిస్తున్నారు. టాటా ఎడ్యుకేషన్ ట్రస్ట్, టాటా సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్, సార్వజనిక్ ట్రస్ట్‌తోపాటు ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్‌కు సైతం ఆమె సారథ్యం వహిస్తున్నారు. స్పెయిన్‌లోని ఐఈ బిజినెస్ స్కూల్ నుంచి డిగ్రీ పట్టా అందుకున్న ఆమె.. ప్రసిద్ధి చెందిన తాజ్ హోటళ్లను చూస్తున్నారు.



మాయా టాటా. ఆమె వయస్సు 36 ఏళ్లు. ఆర్‌డీ టాటా ట్రస్ట్, టాటా ఎడ్యుకేషన్ ట్రస్ట్, సర్వజనిక్ ట్రస్ట్ వ్యవహారాల్లో ఆమె కీలక భూమిక పోషిస్తున్నారు. యూకేలో బేయెస్ బిజినెస్ స్కూల్‌లో ఆమె ఉన్నత విద్యను అభ్యసించారు. ప్రస్తుతం ఆ గ్రూప్‌లోని టాటా డిజిటల్‌లో ఆమె కీలకంగా వ్యవహరిస్తున్నారు. నెవిల్లే టాటా. 32 ఏళ్లు. టాటా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ వంటి పలు టాటా ట్రస్టుల్లో అతడు కీలకంగా వ్యవహరిస్తున్నారు. యూకేలో బేయెస్ బిజినెస్ స్కూల్ నుంచి డిగ్రీ పట్టా అందుకున్నారు. మానసీ కిర్లోస్కర్‌ను వివాహం చేసుకున్న అతడికి ఇద్దరు సంతానం.

**రతన్ టాటా అవివాహితుడు.. అందుకే**

రతన్ టాటా వివాహం చేసుకోలేదు. నాలుగు సార్లు ఆయన వివాహం చేసేందుకు ప్రయత్నించారు. కానీ చివరి నిమిషంలో అవి కాస్తా ఆగిపోయాయి. దీంతో రతన్ టాటా ఆజన్మబ్రహ్మచారిగానే ఉండిపోయారు. రతన్ టాటా 10 ఏళ్ల వయస్సులోనే తల్లిదండ్రులు విడిపోయారు. నాటి నుంచి నానమ్మ వద్దే ఆయన పెరిగారు. ఇక రతన్ టాటా తండ్రి నావల్ టాటాకి రెండు వివాహాలు. నావల్ టాటా.. సిమోన్ టాటాను వివాహం చేసుకున్నారు. వారికి నోయెల్ టాటా జన్మించారు. ఈ నేపథ్యంలో రతన్ టాటా వారసుడిగా నోయెల్ తీసుకునే అవాకాశాలున్నాయని ఓ ప్రచారం అయితే సాగుతుంది. అదీకాక నోయెల్ భార్య ఆలూ మిస్త్రీ. ఆమె మిస్త్రీ పల్లోంజి కుమార్తె. ఆమె సోదరుడే సైరస్ మిస్త్రీ. గతంలో టాటా సంస్థ ఛైర్మన్‌గా ఆయన పని చేసిన విషయం విధితమే.

మరోవైపు టాటా సంస్థలకు వచ్చిన ఆదాయంలో దాదాపు 66 శాతం సేవా కార్యక్రమాలకు విరాళం ఇచ్చేస్తారన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రతన్ టాటా వారసుడి ఎంపిక వ్యవహారం అత్యంత కీలకంగా మారనుందని తెలుస్తుంది.

**రతన్ టాటాకు కడసారి నివాళి అర్పించిన పెంపుడు కుక్క 'గోవా'**

టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటాకు మానవత్వమే కాదు జంతువుల పట్ల, ముఖ్యంగా కుక్కల పట్ల ప్రగాఢమైన ప్రేమ, కరుణ ఉన్నాయి. పెంపుడు కుక్క 'గోవా' రతన్ టాటాకు కడసారి నివాళి అర్పించింది. హృదయాన్ని హత్తుకునే ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 11 ఏళ్ల కిందట రతన్ టాటా గోవా వెళ్లినప్పుడు ఒక వీధి కుక్క ఆయనను అనుసరించింది. దీంతో దానిని పెంచుకోవాలని నిర్ణయించి ముంబై తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో బాంబే హౌస్‌లోకి దానికి ఘనంగా స్వాగతం లభించింది. గోవా నుంచి తెచ్చిన ఆ కుక్కకు 'గోవా' అని ఆయన పేరుపెట్టారు. బాంబే హౌస్‌లోని ఇతర కుక్కలతోపాటు ఆ కుక్క కూడా పెరిగింది. 'గోవా'తోపాటు ఇతర కుక్కలతో దిగిన ఫొటోను రతన్ టాటా ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా షేర్ చేశారు.

కాగా, రతన్ టాటాకు కుక్కలతో చాలా అనుబంధం ఉంది. 2018లో బ్రిటిష్ రాజ కుటుంబం నుంచి ప్రతిష్ఠాత్మకమైన లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఆయన అందుకోవాల్సి ఉంది. రతన్ టాటా దాతృత్వం, విరాళాలను గౌరవించేందుకు నాటి ప్రిన్స్ చార్లెస్, బ్రిటీష్ ఆసియన్ ట్రస్ట్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే రతన్ టాటా దీనికి హాజరుకాలేదు. అనారోగ్యంతో ఉన్న తన పెంపుడు కుక్కను చూసుకోవడానికి ఇంట్లోనే ఆయన ఉండిపోయారు. 'టాంగో, టిటో నా కుక్కలు. వాటిలో ఒకటి భయంకరమైన అనారోగ్యానికి గురైంది. నేను దానిని వదిలి రాలేను' అని రతన్ టాటా పేర్కొన్నారు. వ్యాపారవేత్త సుహెల్ సేథ్ ఈ విషయాన్ని వెల్లడించారు

**రతన్ టాటా గౌరవార్థం.. సంతాపదినం ప్రకటించిన గుజరాత్**

గుజరాత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మృతికి గౌరవ సూచికంగా గురువారం సంతాప దినంగా ప్రకటించింది. జాతీయ జెండాను అవనతం చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను సగానికి ఎగురవేస్తామని తెలిపింది. నేడు జరగాల్సిన అన్ని వినోదాత్మక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

**గుడ్ బై మై డియర్ లైట్‌హౌస్ - జనరల్ మేనేజర్‌గా, అసిస్టెంట్ శంతను నాయుడు**

దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మరణం యావత్తు దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. రతన్ టాటా మృతిపట్ల పలువురు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార రంగంతోపాటు దాతృత్వంలో ఆయన సేవలకు గుర్తు చేసుకుంటున్నారు. ఇదే సమయంలో రతన్ టాటాకు అత్యంత ఆప్తుడు, టాటా ట్రస్ట్‌లో పిన్న వయస్కుడైన జనరల్ మేనేజర్‌గా, అసిస్టెంట్‌గా వ్యవహరించిన శంతను నాయుడు తన స్నేహితుడి (రతన్ టాటా) మరణంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'గుడ్ బై మై డియర్ లైట్ హౌస్' అంటూ వీడ్కోలు పలికారు. మీ మరణంతో మన స్నేహంలో శూన్యం మిగిలింది. మీరు లేని లోటును అధిగమించేందుకు ఈ జీవితాంతం ప్రయత్నిస్తాను. ఈ ప్రేమ దూరమవడంతో కలుగుతోన్న దుఃఖం పూడ్చలేనిది. గుడ్ బై.. మై డియర్ లైట్‌హౌస్' అంటూ శంతను ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలో తీసుకున్న ఫొటోలను కూడా షేర్ చేశాడు 30 ఏళ్ల శంతను. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.







# రేవంత్ అబద్ధాలు ఆపు..

మొదటి పేజీ తరువాయి

అదనంగా కలిపారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. డిసెంబర్ 31, 2024 లోగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మాటిచ్చింది. ఆ ప్రకారం రేవంత్ రెడ్డి ఉద్యోగాలు భర్తీ చేయాలి. రిక్రూట్ మెంట్ సైకిల్‌లో భాగంగా మొదట ఉద్యోగ ఖాళీలు గుర్తించాలి.. ఆ పనే జరగలేదు. కోదండరాం ఏం చేస్తున్నారు.. సెక్రటేరియట్ వెళ్లి ఖాళీలు గుర్తించి సీఎం రేవంత్‌కు జాబితా ఇవ్వొచ్చు కదా..? నిరుద్యోగులతో సభ పెట్టి ఎన్ని ఖాళీలు ఉన్నాయో రేవంత్ చెప్పాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.





# అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

మొదటి పేజీ తరువాయి

నిర్వహించుకుంటున్న ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు తోడుగా ఉండాలని పురుష ప్రపంచానికి సీతక్క విజ్ఞప్తి చేశారు. సాంస్కృతిక శాఖకు సీఎం పూర్తి స్థాయి స్వేచ్ఛనిచ్చారని చెప్పారు. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగను నగరంతో పాటు గ్రామాలలో ఎంతో ఘనంగా చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని మంత్రి గుర్తు చేశారు. బతుకమ్మ అంటే బతుకునిచ్చే పండగ అని, తెలంగాణ అంటే వాగులు, వంకలు, గుట్టలు, చెరువులు అని మంత్రి సీతక్క అన్నారు. చెరువుల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నామని, అలాంటి చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. బతుకమ్మలో ప్రతి పువ్వుకు ఒక గుణం ఉందని, పూర్వీకులు మనకు ఇచ్చినటువంటి పండుగకు భక్తితో పాటు శాస్త్రీయ కారణాలు ఉన్నాయని మంత్రి వివరించారు. గౌరమ్మను చేసే పసుపులో యాంటీబయాటిక్ ఉందని, చెరువులలో వేసే పూలతో నీరు శుద్ధి అవుతుందని బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని మంత్రి సీతక్క చెప్పారు. బతుకమ్మను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరికీ ఉందని, భవిష్యత్ తరాలకు మన బతుకమ్మను అందించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.



# కొండా సురేఖపై కేటీఆర్ పరువునష్టం

మొదటి పేజీ తరువాయి

కొండా సురేఖపై పరువు నష్టం దావా వేశారు. ఆయన తరఫు న్యాయవాది ఉమమహేశ్వరరావు నాంపల్లి ప్రత్యేక కోర్టులో దీనికి సంబంధించి పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా పేర్కొన్నారు. తన ప్రతిష్టను దెబ్బతీసేలా ఆమె వ్యాఖ్యానించారని క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఇటీవలే హీరో నాగార్జున మంత్రి సురేఖపై పరువు నష్టం దావా వేశారు. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు.

**ఇప్పటికే లీగల్ నోటీసులు**

కాగా, ఫోన్ ట్యాపింగ్ సహా సమంత, నాగచైతన్య విడిపోవడానికి ప్రధాన కారణం కేటీఆర్ అంటూ ఇటీవల కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కేటీఆర్.. తనపై అసత్య ఆరోపణలు చేశారని.. సంబంధం లేని విషయాల్లో అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. తన గౌరవానికి, ఇమేజ్‌కు భంగం కలిగించాలనే లక్ష్యంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీసుల్లో పేర్కొన్నారు. కేవలం రాజకీయ కక్షతో, తన ప్రయోజనాల కోసమే తన పేరును వాడుకుంటున్నారని.. మహిళ అయి ఉండి సాటి మహిళ పేరును, సినిమా నటుల పేరును వాడుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడడం దురదృష్టకరమని అన్నారు. 'ఒక మంత్రిగా కొండా సురేఖ మంత్రి హోదాని దుర్వినియోగం చేశారు. ఎలాంటి సాక్ష్యాలు లేకుండా ఆమె చేసిన అసత్య వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. మంత్రిగా తన సహచర అసెంబ్లీ సభ్యుడనే సోయి లేకుండా మాట్లాడడం ఆశ్చర్యానికి గురి చేసింది. అబద్ధాలు, అసత్యాలు మాట్లాడినందుకు ఆమె బహిరంగ క్షమాపణ చెప్పాలి.' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**కోర్టు నోటీసులు**

మరోవైపు, ఈ వ్యవహారంలో సినీ నటుడు నాగార్జున సైతం నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. తన కుటుంబంతో పాటు, కుమారుడు నాగచైతన్య సమంత విడాకుల అంశంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం మంత్రికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది. అంతకు ముందు విచారణ సందర్భంగా నాగార్జున స్టేట్ మెంట్ రికార్డు చేయాలని కోర్టు ఆదేశించడంతో.. నాగార్జున, అమల, నాగచైతన్య నాంపల్లి కోర్టుకు మంగళవారం హాజరయ్యారు. అటు, కొండా సురేఖ వ్యాఖ్యలను పలువురు సినీ ప్రముఖులు సైతం ఖండించారు. ఆధారాల్లేని వ్యాఖ్యలు చేస్తే మౌనంగా ఊరుకోమని.. ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. తన వ్యాఖ్యల ఉద్దేశం మహిళల పట్ల ఓ నాయకుడి చిన్నచూపు ధోరణిని ప్రశ్నించడమే కానీ.. సమంత మనోభావాలను దెబ్బతీయడం కాదన్నారు. స్వయంశక్తితో ఆమె ఎదిగిన తీరు తనకు కేవలం అభిమానం మాత్రమే కాదు.. ఆదర్శం అని కూడా పేర్కొన్నారు.



# తెలుగుదేశం నాకు రాజకీయ భిక్ష పెట్టింది

మొదటి పేజీ తరువాయి

స్పందించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని తన అల్లుడు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాజశేఖర్ రెడ్డి కుమార్తె పెళ్లి ఆహ్వాన పత్రిక కిషన్‌రెడ్డికి అందజేసి వివాహ మహోత్సవానికి హాజరుకావాలంటూ సాదరంగా ఆహ్వానించారు. మనవరాలు పెళ్లి శుభలేఖ ఇచ్చి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వంగా ఆహ్వానించడానికి తాము బీజేపీ కార్యాలయానికి వచ్చినట్లు మల్లారెడ్డి తెలిపారు. వ్యక్తిగతంగా కిషన్‌రెడ్డి నాకు చిన్నప్పట్నుంచి బాగా తెలిసిన వ్యక్తి ఆయన బీజేపీలో అంచెలంచెలుగా కేంద్రమంత్రి స్థాయిదాకా ఎదగడం చాలా సంతోషంగా ఉందన్నారు. మరోవైపు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్లోని సీఎం నివాసానికి తన అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి వెళ్లారు. మర్రి రాజశేఖర్ రెడ్డి కూతురు పెళ్లి ఆహ్వాన పత్రికను సీఎం రేవంత్ రెడ్డికి మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి కలిసి అందజేశారు. మూడు రోజుల క్రితం ఏపీ సీఎం చంద్రబాబునాయుడును కూడా కలిసిన మల్లారెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. దీంతో మల్లారెడ్డి తెలుగు దేశం పార్టీలో చేరుతున్నారని పుకార్లు వచ్చాయి. దీన్ని ఖండించిన మల్లారెడ్డి మనువరాలు పెళ్లి నేపథ్యంలో చంద్రబాబును కలిసినట్టు తెలిపారు. ఇవాళ మాత్రం తనకు రాజకీయ భిక్ష పెట్టింది తెలుగుదేశం పార్టీనని వ్యాఖ్యానించండం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఒకే దేశం, ఒకే ఎన్నికలు ప్రణాళికను రద్దు చేయండి

మొదటి పేజీ తరువాయి

తరపున ఆ రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఎంబీ రాజేష్ ఈ తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రతిపాదన దేశంలోని సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. 'ఈ ప్రతిపాదన అప్రజాస్వామికం. దేశంలోని సామాజిక, సాంస్కృతిక, రాజకీయ వైవిధ్యాలను దెబ్బతీసే ప్రయత్నం. ఖర్చులను తగ్గించడానికి, సులభతరమైన పాలనను నిర్ధారించడానికి సులభమైన మార్గాలున్నాయి. రాజ్యాంగంలోని ప్రధానమైన సమాఖ్య నిర్మాణాన్ని నాశనం చేయడం, ప్రజల హక్కులను సవాలు చేయడం, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక స్వపరిపాలన హక్కులను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదన ఉంది' అని అన్నారు. కాగా, 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రతిపాదన అధికార కేంద్రీకరణకు దారితీస్తుందని మంత్రి ఎంబీ రాజేష్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో కేంద్రీకృత, ఏకీకృత పరిపాలనా వ్యవస్థను అమలు చేయడానికి బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఎజెండాలో ఇది ఒక భాగమని ఆయన ఆరోపించారు. మరోవైపు కేరళ అసెంబ్లీలో బీజేపీకి ఒక్క శాసనసభ్యులైనా లేరు. అలాగే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రతిపాదనకు వ్యతిరేకంగా తీర్మానం చేసిన మొదటి రాష్ట్ర అసెంబ్లీగా కేరళ నిలిచింది.





# రేవంత్‌ను మాదిగలు నమ్మరు

మొదటి పేజీ తరువాయి

నడుస్తోందని ఆరోపించారు. గ్రూప్1, గ్రూప్2 పరీక్షలకు వర్గీకరణ వర్తింపజేయాలని.. లేదంటే వర్గీకరణ తర్వాతే గ్రూప్1 పరీక్ష నిర్వహించాలని, గ్రూప్3 పరీక్షలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగాయని, వర్గీకరణ జరిగే వరకు మరో 2 నెలలు వాయిదా వేయాలని కోరారు. ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహిస్తామన్న ఆయన.. ఆ సమావేశంలో అన్ని కమిటీల సభ్యులు పాల్గొంటారని అన్నారు. ఇప్పటివరకు ఆవేదనతోనే నిరసన చేశామని.. ఇకపై తమ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

# బెంగళూరు తరహాలో హైదరాబాద్‌లో 'హైడ్రా' చర్యలు

మొదటి పేజీ తరువాయి

మురికి కూపాలుగా మారాయని చెప్పారు. ప్రస్తుతం ఆ చెరువులకు పునరుజ్జీవనం ఇచ్చేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటోందని ఏ.వి.రంగనాథ్ వెల్లడించారు.గురువారం హైదరాబాద్‌లో హైడ్రా కార్యాలయంలో లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ వీ రంగనాథ్ మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని ఆయన స్పష్టం చేశారు. పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కాలనీ, బస్తీ వాసులు, స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసి చెరువులను పునరుద్ధరించనున్నామన్నారు. హైదరాబాద్‌లోని హైడ్రా కార్యాలయం నుంచి నేరుగా బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ జరిగిన తీరును కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఆ క్రమంలో బెంగళూరులో మురుగుతో, నీళ్లు లేకుండా ఉన్న వాటిని ఎలా మంచినీటి చెరువులుగా మార్చారో.. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏవీ రంగనాథ్‌కు ఆనంద్ వివరించారు. అందులో భాగంగా బెంగళూరు మహానగరంలో మొత్తం 35 చెరువులను పునరుద్ధరించిన విధానాన్ని ఈ సందర్భంగా ఆనంద్ సోదాహరణగా తెలిపారు. అతి తక్కువ వ్యయంతో చెరువులకు పునరుజ్జీవనం కల్పించిన తీరును హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఆయన వివరించారు. పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించి స్వచ్ఛమైన నీరు చెరువులోకి వెళ్లేలా ఏర్పాట్లు సైతం చేశారు. అలాగే మురుగు నీటి కాలువల నుంచే శుద్ధి చేసే ప్రక్రియను ప్రారంభించి.. చెరువులోకి చేరే ముందు మూడు నాలుగు దశల్లో నీరు ఉంచి ఫిల్టర్ చేసిన తీరును హైడ్రా అధికారులు ఈ సందర్భంగా ఆసక్తిగా గమనించారు. ఇక మురుగు నీటి కాలువలకు రెండు వైపులా మొక్కలు నాటడం, చెరువులోకి నీరు చేరే లోపే కొంత మేర శుద్ధి జరిగేలా బెంగళూరులో అమలు చేసిన విధానంపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయాలని హైడ్రా అధికారులు నిర్ణయించారు. అలాగే ఆనంద్ మల్లిగవాడ్‌ను హైదరాబాద్‌కు పిలిపించి.. ఇక్కడ చెరువుల పునరుద్ధరణకు ఆయన సహాయం కోరనున్నట్లు హైడ్రా కమిషనర్ తెలిపారు. అదే విధంగా కూల్చివేతల వ్యర్థాలను తొలగించి ముందుగా సున్నం చెరువు, అప్పా చెరువు, ప్రగతినగర్ వద్ద ఉన్న ఎర్రకుంట, కూకట్‌పల్లి చెరువులకు రక్షణ కల్పించాలని హైడ్రా నిర్ణయించింది. చెరువుల్లో శుద్ధ జలాలుంటే ఆయా పరిసరాలు చల్లగా ఉంటాయని హైడ్రా భావిస్తుంది. ఏపుగా పెరిగిన మొక్కలతో చక్కటి పర్యావరణం స్థానికులకు అందుతుందన్నారు. అందుకే ఈ కార్యక్రమంలో స్థానికులను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం కల్పించి.. వారికే నిర్వహణ బాధ్యతలు స్వచ్ఛందంగా తీసుకునేలా కసరత్తు జరుగుతుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరించారు.



# జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలికి భారీ షాక్

- తెలంగాణ కేడర్ లో కొనసాగించాలన్న దర్యాప్తు తిరస్కరణ
- ఏపీలో జాయిన్ అవ్వాలని కేంద్రం ఉత్తర్వులు
- ఖండేకర్ కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా ఆమె ఏపీకే చెందుతారు
- కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ స్పష్టీకరణ



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ పోస్టుతోపాటు పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారిణి కాటా అమ్రపాలికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ షాక్ ఇచ్చింది. తనను తెలంగాణ క్యాడర్‌లోనే కొనసాగించాలని పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించింది. ఆమెను విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిచారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో జాయిన వ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. 2010 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారిణి అయిన అమ్రపాలి తనను తెలంగాణ స్థానికత ఉన్న అధికారిగా గుర్తించాలని చేసిన విజ్ఞప్తిని తోసి పుచ్చారు. ఖండేకర్ కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా ఆమె ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కే చెందుతారని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

రాష్ట్ర విభజన తర్వాత సివిల్ సర్వీసు అధికారుల కేటాయింపు కోసం ఖండేకర్ కమిటీని నియమించారు. ఆ కమిటీ నిబంధనల ప్రకారం విభజించింది. అయితే ఆ నివేదికలో పేర్కొన్న పలువురు తమ క్యాడర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి,క్యాట్ కు దరఖాస్తుకు పెట్టుకున్నారు. ఏపీకి కేటాయించిన ఎక్కువ మంది తాము తెలంగాణ స్థానికతతో ఉన్నామని తమకు తెలంగాణ క్యాడరే కావాలని ఉండిపోయారు. అలాంటి అధికారి అయిన సోమేష్ కుమార్ ఏపీలో సీఎస్‌గా ఉండగా కోర్టు ఏపీకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. దాంతో ఆయన తెలంగాణ నంచి రిలీవ్ అయి ఏపీలో రిపోర్ట్ చేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఇప్పుడు అమ్రపాలికి కూడా దాదాపుగా అదే పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ కమిషనర్ గా ఉన్న ఆమె ఉన్నపళంగా ఏపీలో రిపోర్టు చేయాల్సిన పరిస్థితి వస్తోంది.

ఖండేకర్ కమిటీ సిఫారసులు చేసిన సమయంలో స్థిర నివాసం అనే కాలమ్‌ను కీలకంగా తీసుకున్నారు. యూపీఎస్సీకి దరఖాస్తు చేసిన సమయంలో కాట అమ్రపాలి తన పర్మినెంట్ అడ్రస్‌గా విశాఖ పట్నంను పేర్కొన్నారు. ఖండేకర్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత ప్రత్యూష్ సిన్హా కమిటీ ఆ నివేదిక ఆధారంగా క్యాడర్‌ను కేటాయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఖండేకర్ కమిటీ ఆమెను ఏపీకి కేటాయించింది. అయితే తనను తెలంగాణ స్థానికురాలిగా పరిగణించి.. తెలంగాణకే కేటాయించాలని ఆమె అప్పీల్ చేసుకున్నారు. ప్రత్యూష్ సిన్హా కమిటీ మొదట్లోనే ఆమె అభ్యర్థనను తిరస్కరించింది.

హైకోర్టు కూడా ఖండేకర్ కమిటీ ఆధారంగా ప్రత్యూష్ సిన్హా కమిటీ చేసిన సిఫారసులనే అమలు చేయాలని స్పష్టం చేసింది. కాట అమ్రపాలికి ప్రస్తుతం అన్ని మార్గాలు మూసుకుపోయినట్లేనని ఆమె ఖచ్చితంగా తెలంగాణలో రిలీవ్ అయ్యి.. ఏపీలో రిపోర్టు చేయాల్సిందేనని భావిస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత వరంగల్ జిల్లాకు కలెక్టర్ గా చేసిన అమ్రపాలి తర్వాత కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఓఎస్డీగా.. ప్రధానమంత్రి కార్యాలయంలోనూ పని చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ తెలంగాణకు వచ్చారు రేవంత్ సర్కార్ లో ఆమెకు కీలక పోస్టులు దక్కాయి. అయితే ఇప్పుడు ఏపీకి తప్పక వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# కాంగ్రెస్ ఓటమికి కారణం వినేష్ ఫోగటే

- ఆమె ఎక్కడికి వెళ్లినా విధ్వంసమే..
- వినేశ్ గెలిచేందుకు నా పేరు వాడుకున్నారు
- కానీ ఆమె గెలిచింది కాంగ్రెస్ ను ఓడించింది
- బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి ఆ పార్టీ ఎమ్మెల్యే, స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగటే కారణమని డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వినేష్ వల్లే కాంగ్రెస్ పార్టీ సర్వ నాశనమైందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆమె కాంగ్రెస్‌లో ఉండటమే హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణమని పేర్కొన్నారు. "వో జహా జహా జాయేగీ, సత్యనాష్ హోగా (ఆమె ఎక్కడికి వెళ్లినా విధ్వంసమే)" అని విమర్శించారు. తన పేరు వాడుకుని వినేష్ జులానా సీటు నుంచి గెలుపొందారని, అందుకే తాను గొప్ప వ్యక్తినని పేర్కొన్నారు. "చాలా మంది బీజేపీ అభ్యర్థులు 'జాట్' జనాభా అత్యధికంగా ఉన్నస్థానాల్లో గెలిచారు. ఆందోళనలు చేసిన రెజ్లర్లు హరియాణాకు చెందిన హీరోలు కాదు. జూనియర్ రెజ్లర్లందరికీ కూడా వారు విలన్‌లే. వినేష్ గెలవడానికి నా పేరు వాడుకున్నారు. అందుకు నేను కారణమంటే నాకంటే గొప్ప వ్యక్తి ఎవరు. కానీ ఆమె గెలిచిం కాంగ్రెస్‌ను ఓడించింది" అని బ్రిజ్ భూషణ్ అన్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలలో జులానా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వినేష్ గెలిచిన కొన్ని గంటల తరువాత బ్రిజ్ భూషణ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సంవత్సరం ప్రారంభంలో వినేష్ ఫోగట్, తోటి రెజ్లర్ బజరంగ్ పునియాతో కలిసి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కాంగ్రెస్.. వినేష్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది.

**వివాదమిదే..**

గతేడాది వరకు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్.. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా ఉన్నారు. అయితే చీఫ్‌గా ఉన్న సమయంలో మహిళా రెజ్లర్లపై బ్రిజ్ భూషణ్.. లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడ్డారని.. రెజ్లర్లు సంచలన ఆరోపణలు చేశారు. ఇక వినేష్ ఫోగట్ సహా అగ్రస్థాయి రెజ్లర్లు దేశ రాజధాని ఢిల్లీతోపాటు వివిధ రాష్ట్రాల్లో నిరసనలు, ఆందోళనలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే అప్పుడు బీజేపీ తరఫున ఎంపీగా ఉన్న బ్రిజ్ భూషణ్‌పై చర్యలకు పోలీసులు, ప్రభుత్వాలు వెనుకాడటంతో కోర్టులను ఆశ్రయించగా.. ఆయనపై కేసులు నమోదు చేయాలని కోర్టులు ఆదేశాలు జారీ చేశాయి. దీంతో ఆయనను డబ్లూఎఫ్ఐ చీఫ్ పదవి నుంచి తప్పించి కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆయనపై కేసులు విచారణ దశలో ఉన్నాయి.

# ఏపీకి వెళ్లిపోండి..!

**స్టేట్ బ్యూరో:**

ఐఏఎస్, ఐపీఎస్ కేడర్ విభజనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పదమూడు మంది అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చిన కేంద్రం తాము గతంలో కేటాయించిన రాష్ట్రానికే వెళ్లాలని స్పష్టం చేసింది. తెలంగాణలో ఉన్న ఐఏఎస్ అధికారులు వాణీ ప్రసాద్, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, ఆమ్రపాలి, మల్లెల ప్రశాంతి ఐపీఎస్‌లు అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మొహంతిని ఏపీకి వెళ్లాలని డీవోపీటీ ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఐఏఎస్‌లు అనంతరాము, ఎస్ఎస్ రావత్, ఎల్.శివశంకర్, సృజన, హరి కిరణ్‌ను తెలంగాణలో చేరాలని కేంద్రం స్పష్టం చేసింది. ఉమ్మడి రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్‌లను 2014లో తెలంగాణ, ఏపీ మధ్య విభజిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ఐఏఎస్ అధికారులు సోమేష్ కుమార్, వాణీ ప్రసాద్, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, ఆమ్రపాలి, ప్రశాంతి ఐపీఎస్‌లు అంజనీ కుమార్, సంతోష్ మెహ్రా, అభిలాష బిస్త్, అభిషేక్ మొహంతిని ఏపీకి కేటాయించారు. ఐఏఎస్ అధికారులు అనంతరాము, సృజన గుమ్మళ్ల, ఎస్ఎస్ రావత్, ఎల్.శివశంకర్, సి.హరి కిరణ్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను తెలంగాణను కేటాయించారు.

**క్యాట్‌ను ఆశ్రయించిన అధికారులు**

విభజన తీరుపై అభ్యంతరం వ్యక్తం వీరందరూ 2014లో కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. ఆ తర్వాత రంగనాథ్, సంతోష్ మెహ్రా తమ పిటిషన్లను వెనక్కి తీసుకున్నారు. మిగతా పిటిషన్లపై విచారణ జరిపిన క్యాట్ 2016లో అధికారులకు అనుకూలంగా తీర్పు వెల్లడించింది. క్యాట్ తీర్పులను సవాల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం పరిధిలోని డీవోపీటీ 2017లో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. మొదట పిటిషన్లపై వేర్వేరుగా విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు సోమేష్ కుమార్ తెలంగాణ కేడర్‌ను రద్దు చేసి ఏపీకి వెళ్లాలని గతేడాది జనవరిలో ఆదేశించింది. మిగతా పిటిషన్లన్నీ కలిపి విచారణ జరిపిన హైకోర్టు. అధికారుల అభ్యర్థనలు, అభ్యంతరాలను మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఈ ఏడాది మార్చిలో తీర్పు వెల్లడించింది.

**ఆ అధికారులకు ఏపీలో చేరాలని ఆదేశం**

హైకోర్టు ఆదేశాల మేరకు కేడర్ కేటాయింపుల పునః పరిశీలన కోసం డీవోపీటీ మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి దీపక్ ఖండేకర్‌ను కేంద్రం నియమించింది. దీపక్ ఖండేకర్ ఏకసభ్య కమిటీ ఐఏఎస్, ఐపీఎస్‌ల అభ్యంతరాలు, అభ్యర్థనలు, వాదనలు పరిశీలించింది. అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చి గతంలో డీవోపీటీ నిర్ణయమే సరైనదని దీపక్ ఖండేకర్ సిఫార్సు చేసింది. కమిటీ సిఫార్సుల మేరకు తాజాగా డీవోపీటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఐఏఎస్ అధికారులు వాణిప్రసాద్, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, ఆమ్రపాలి, ఎం.ప్రశాంతి ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మొహంతి ఏపీలో చేరాలని ఆదేశించింది. ఐఏఎస్ అధికారులు అనంతరాము, ఎస్ఎస్ రావత్, ఎల్.శివశంకర్, శ్రీజన, హరికిరణ్ తెలంగాణలో ఈనెల 16లోగా చేరాలని ఆదేశించింది.



# సాహిత్యంలో హాన్ కాంగ్‌కు నోబెల్ పురస్కారం

మొదటి పేజీ తరువాయి

కాంగ్‌ను వరించింది. మానవ జీవితంలోని దుర్బలత్వంతోపాటు చారిత్రక విషాదాలను ఆమె.. తన రచనల్లో కళ్లకు కట్టారని రాయల్ స్వీడిష్‌అకాడమి గురువారం వెల్లడించింది. ఇప్పటికే వైద్య రంగంతోపాటు రసాయన, భౌతిక శాస్త్రాల్లో నోబెల్ బహుమతుల విజేతల పేర్లను నిర్వాహకులు ప్రకటించారు.రసాయన శాస్త్రంలో ఈ ఏడాది నోబుల్ బహుమతి ముగ్గురిని వరించింది. యూఎస్‌కు చెందిన డేవిడ్ బేకర్‌తోపాటు బ్రిటన్‌కు చెందిన డెమిస్ హస్సాబిస్, జాన్ జంపర్‌కు ఈ పురస్కారం దక్కింది. ప్రోటీన్ల ఆవిష్కరణలో వీరు చేసిన కృషికి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమి బుధవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇక ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి జాన్ హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌లకు దక్కింది. వీరిద్దరు కృత్రిమ నాడీ వ్యవస్థలతో మెషీన్ లెర్నింగ్‌ను సాధ్యం చేసేలా సిద్ధాంతపరమైన ఆవిష్కరణలకు రూపకల్పన చేశారు. దీంతో వీరిని భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతికి నిర్వాహకులు ఎంపిక చేశారు. అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్‌కున్‌లకు నోబెల్ పురస్కారం దక్కింది. మైక్రో ఆర్ఎన్ఏ ఆవిష్కరణతోపాటు జన్యు నియంత్రణలో దాని పాత్రను వీరిద్దరు వివరించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరిని నోబెల్ పురస్కారాన్ని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇక సాహిత్యంలో నోబెల్ విజేత పేరు అక్టోబర్ 14వ తేదీన నిర్వాహకులు ప్రకటించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 10వ తేదీన స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నోబెల్ విజేతలకు నిర్వాహకులు ఈ పురస్కారాలను అందజేయనున్నారు.



# మెకానిక్‌కు జాక్‌పాట్

**కేరళ లాటరీలో రూ.25 కోట్లు**
**15 ఏళ్లుగా లాటరీ టికెట్ల కొనుగోలు**

**వారధి న్యూస్, బెంగళూరు:**

కర్ణాటకకు చెందిన ఓ మెకానిక్‌కు అదృష్టం వరించింది. కేరళలో ఓనం సందర్భంగా కొనుగోలు చేసిన లాటరీ టికెట్‌తో ఏకంగా రూ.25 కోట్లు గెలుచుకున్నాడు. మైసూరులోని పాండవపురానికి చెందిన అల్తాఫ్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. 15 ఏళ్ల నుంచి లాటరీ టికెట్ కొంటున్నాడు. కానీ ఎప్పుడూ జాక్‌పాట్ రాలేదు. అయితే ఓనం సందర్భంగా కేరళలో ఉన్న తన స్నేహితుడు ఎస్‌జే ఏజెన్సీ వద్ద అల్తాఫ్ పేరు మీద ఒక టికెట్‌ను కొన్నాడు.తాజాగా తీసిన లాటరీ డ్రా విజేతలను ప్రకటించారు. అందులో అల్తాఫ్ కొన్న టికెట్ నంబర్ TG43222కి మొదటి బహుమతి వచ్చిందని వెల్లడించారు. లాటరీ ద్వారా వచ్చిన నగదును తన ఇంటి నిర్మాణానికి ఖర్చు చేస్తానని అల్తాఫ్ తెలిపాడు. అలాగే తన కుమార్తె పెళ్లికి ఉపయోగిస్తానని చెప్పాడు. ఈ డ్రాలో మరో ఇరవై మందికి రెండో బహుమతి గెలుచుకున్నారు. ఒక్కొక్కరికి రూ.2కోట్లు బహుమతి వరించింది. మూడో బహుమతి కింద 20 మందికి రూ.50 లక్షలు చొప్పున గెలుచుకున్నారు. మొత్తం 71 లక్షల పైగానే టికెట్లు అమ్ముడైనట్లు కేరళ లాటరీ డైరెక్టర్ అబ్రహం తెలిపారు. పాలక్కడ్‌లో అత్యధికంగా టికెట్‌లు అమ్ముడయ్యాయని వెల్లడించారు.



# ఒకవైపు యుద్ధం.. మరోవైపు స్నేహ గీతం

**విశాలభారతి, న్యూఢిల్లీ:**

21వ శతాబ్దం భారత్, ఆసియాన్ దేశాలదేనని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. తమవి శాంతి కాముక దేశాలని.. పరస్పరం జాతీయ సమగ్రత, సార్వభౌమాధికారాలను గౌరవించుకుంటామని ఆయన తెలిపారు. భావితరాల కోసం బంగారు భవిష్యత్తును నిర్మించాలనే బలమైన సంకల్పంతో భారత్, ఆసియాన్ దేశాలు ముందుకు సాగుతున్నాయన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని మోడీ గురువారం ఉదయం లావోస్‌కు చేరుకున్నారు. రాజధాని వియెన్‌టియేన్‌లో జరిగిన 21వ భారత్‌ఆసియాన్ సదస్సులో ఆయన ప్రసంగించారు. "ప్రపంచంలో పలుచోట్ల యుద్ధాలు జరుగుతున్నాయి. ఉద్రిక్తతలు తీవ్రరూపు దాలుస్తున్నాయి. ఇటువంటి క్లిష్ట తరుణంలో ఇండియా ఆసియాన్ స్నేహబంధం మరింత బలోపేతం అవుతుండటం గొప్ప విషయం" అని మోడీ పేర్కొన్నారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలోని సముద్ర జలాల్లో చైనా దూకుడుకు కళ్లెం వేయడంపై భారత ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇండో పసిఫిక్ ప్రాంతంలోని సముద్ర జలాల్లో గతేడాది సైనిక విన్యాసాలు చేశాం. ప్రాంతీయ సుస్థిరత, భద్రత కోసం మేమంతా కలిసికట్టుగా ఉంటాం" అని మోడీ స్పష్టం చేశారు. ఆసియాన్ దేశాలతో భారత్ వాణిజ్యం గత పదేళ్లలో రెట్టింపై రూ.10 లక్షల కోట్లకు చేరిందన్నారు.

**సంబంధాల బలోపేతానికి 10 పాయింట్ల ప్రణాళిక**

ఆసియాన్ ప్రాంతంలోని దేశాలతో భారత్ సంబంధాల బలోపేతానికి 10 పాయింట్ల కార్యాచరణ ప్రణాళికను భారత ప్రధాని ప్రకటించారు. యువజన సదస్సులు, స్టార్టప్ ఫెస్టివల్స్, మ్యూజిక్ ఫెస్టివల్స్, హ్యాకథాన్, ఆసియాన్‌ఇండియా మహిళా సైంటిస్టుల సదస్సు, ఆసియాన్‌ఇండియా పరిశోధనా సంస్థల సదస్సు, ఢిల్లీ డైలాగ్ వంటి వాటి ద్వారా సంబంధాలు బలోపేతం అవుతాయన్నారు. భారత్‌లోని నలందా యూనివర్సిటీ, అగ్రికల్చరల్ యూనివర్సిటీలలో చేరే ఆసియాన్ దేశాల విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లను రెట్టింపు చేస్తామని మోడీ తెలిపారు. ఆసియాన్‌భారత్ సరుకు రవాణా ఒప్పందంపై 2025 కల్లా సమీక్షిస్తామని చెప్పారు. 2025ను ఆసియాన్ భారత్ పర్యాటక సంవత్సరంగా మోడీ ప్రకటించారు. ఇందుకోసం ఉమ్మడి ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు భారత్ తరఫున రూ.41 కోట్లు అందిస్తామని ఆయన వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు 'అమ్మ కోసం ఒక మొక్క నాటండి' కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆసియాన్ దేశాల నేతలకు మోడీ పిలుపునిచ్చారు.



# కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

▸ **ప్రపంచ నేత్ర దినోత్సవం**

**ధర్పల్లి విశాల భారతి:** సర్వేంద్రియానాం నయనం ప్రధానం.. కళ్లు మనకు దేవుడిచ్చిన అపురూపమైన నిధి. వాటిని జాగ్రత్తగా కాపాడుకోవడం మన విధి. మనం ప్రతీ వస్తువును చూడాలన్నా కళ్లు చాలా అవసరమని తెలిసినా చాలా మంది కళ్ల విషయంలో చాలా అజాగ్రత్తగా ఉంటారని ప్రభుత్వ వైద్యులు డాక్టర్. సుశాంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆప్తమిక్ ఆఫీసర్ హరినాథ్ నెహ్రూ మాట్లాడుతూ.. ప్రపంచ నేత దినోత్సవం సందర్భంగా ధర్పల్లి మండల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందిచే ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని అలాగే చాలా మంది కంటి నుంచి నీరు కారినప్పుడో.. తలనొప్పిగా ఉన్నప్పుడో.. మామూలు అద్దాల దుకాణానికి వెళ్లి పరీక్షలు చేయించుకోకుండానే కంటి అద్దాలు వాడుతుంటారు. కళ్లను మనం జాగ్రత్తగా చూడకపోతే భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా అక్టోబర్ రెండో గురువారం నాడు 'ప్రపంచ దృష్టి దినోత్సవం' ను నిర్వహిస్తామని, చిన్న వయసు నుండి పిల్లల కళ్ళను జాగ్రత్తగా కాపాడి దృష్టిలోపం రాకుండా మంచి పౌష్టికమైన ఆహారం అందించి వాళ్ళ భవిష్యత్తులో కంటి సమస్య రాకుండా జాగ్రత్త తీసుకోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ అరుణలత, దినేష్,సిబ్బంది కృష్ణ,పద్మ,మురళి,సంతోష్,నరేందర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

**ఆమనగల్లు, విశాల భారతి :** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాటిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పారు. గురువారం ఆమనగల్లు మండలం ఆయా గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పంపిణి చేశారు. ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేదలకు సహాయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెల్గ మల్ల జగన్, పట్టణ అధ్యక్షులు వస్పుల మానయ్య, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రమణ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, ఎంఎ ఖలీల్, జిల్లా నాయకులు కృష్ణ నాయక్, వస్పుల శ్రీశైలం, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ అలీమ్, ఖాదర్ ఖాద్రి, గాజుల సురేష్, తల్లోజు రామకృష్ణ, ఆప్పం శీను, ఎంగలి ప్రసాద్, కరీం, రహీమ్, మెకానిక్ బాబా, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వస్పుల శ్రీకాంత్, నాజర్, దేవరశెట్టి మహేష్, శేఖర్ గౌడ్, కాలే మల్లయ్య, రఫీ, శ్రీను, జంతుక యాదయ్య, వెంకట్ రెడ్డి తదితరులున్నారు.



# క్రీడల్లో గెలుపోటములు సహజం

**ఆమనగల్లు, విశాలభారతి :** క్రీడల ద్వారా శారీరక దృఢత్వం పెరుగుతుందని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఆకుతోటపల్లి మాజీ సర్పంచ్ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు న్యాలపట్ల నరేందర్ రెడ్డి , సింగం శ్రీనయ్య అన్నారు. ఆమనగల్లు మండల పరిధి ఆకుతోటపల్లి గ్రామంలో గ్రామ వాలీబాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. మొత్తం 14 జట్లు పాల్గొనగా విన్నర్స్ గా షాద్ నగర్ టీం గెలుపొందగా రన్నర్స్ గా పడకల్ టీం గెలుపొందారు. బుధవారము ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు బలపడతాయని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం ద్వారా క్రీడా నైపుణ్యాలు బయటపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ ఆర్గనైజర్స్ షఫీ, మల్లేష్, కృష్ణ, విజయ్ కుమార్, శ్రీను, శేఖర్, సాజిద్, మహేష్, చందు, వంశీ, శ్రీకాంత్, నరేష్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



# నేత్రపర్వం దేవి శరన్నవరాత్రి వైభవం

▸ **మహాగౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు**

**ఆమనగల్లు, విశాలభారతి :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కడ్తాల్ పాల శితిలీకరణ కేంద్రం ఆవరణలో ప్రతిష్టించిన అమ్మవారికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్, కడ్తాల సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహా గౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా సమృద్ధిగా వర్షాలు కురిసాయని అమ్మవారి కృప భక్తులపై ఎల్లవేళలా ఉండాలని గంప వెంకటేష్ గుప్తా ఆకాంక్షించారు. ప్రస్తుత వరి ధాన్యం కొనుగోళ్ల సీజన్లో అమ్మవారు రైతులకు నష్టం కలిగించకుండా చూడాలని వేడుకున్నారు. ఈ సంవత్సరం ప్రజలందరూ సుఖసంతోషాలతో పిల్లాపాపలతో పాడిపంటలు సమృద్ధిగా పండి ప్రతి ఒక్కరి ముఖాల్లో అమ్మవారు ఆనందం నింపాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. అనంతరం గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జరుపుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, సింగల్ విండో డైరెక్టర్ ఎనుమల్ల రమేష్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షుడు వీరేంద్ర గుప్తా, దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మహేష్, గౌరవ అధ్యక్షుడు గంప శ్రీనివాస్ గుప్తా, నాయకులు జోగు వీరయ్య, వెంకటేష్, మంగళపల్లి నరసింహ, మహేందర్, హనుమాన్ యూత్ అధ్యక్షుడు సాయి ప్రభు, రవీందర్ రెడ్డి, గుద్దేటి సాయి, ఊర వెంకటేష్, బి వీరేష్, చాట్ల వెంకటేష్, సీఈఓ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.







# ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**ఆమనగల్లు, విశాలభారతి :** దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తలకొండపల్లి మండలం మాదాయపల్లి గ్రామంలో నెలకొల్పిన దుర్గామాతలను స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యటా నరసింహ, వెల్జాల్ మాజీ ఎంపిటిసి మల్లెకిడి అంబాజీ ,వెల్జాల్ మాజీ ఉపసర్పంచ్ అజీజ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, ఏ వెంకటరెడ్డి , టి కృష్ణయ్య గౌడ్,వి.రాజు ,గ్రామ కాంగ్రెస్ నాయకులు మదిగట్ల యాదయ్య, ఏ శ్రీనివాస్ గౌడ్, బి రవి కుమార్,టి భాస్కర్, ఎమ్. ఎల్లయ్య, పెంటయ్య, , తలకొండపల్లి, కడ్తాల్ మండలాల, ముఖ్య నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**ఆకుతోటపల్లిలో:**

ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో దుర్గ భవాని ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ దేవిగా అవతరించింది. బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగం శ్రీనయ్య, గ్రామ యువ నాయకులు న్యాలపట్ల నరేందర్ రెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని ఘనంగా ప్రత్యేక పూజలు చేశారు. పూజ ముగిసిన తరువాత చిన్నారులకు దొనాదుల శ్రీను పలకలు బహుకరించి అక్షరాబ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాలపట్ల సుధాకర్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు కామాజి శేఖర్, కర్ణాటి శివ, సంపంగి కిషోర్, కంబాలపల్లి సాయి, బొల్లు సందీప్, శీల సాయి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

**ఆమనగల్లులో:**

మున్సిపాలిటీలోని పురాతన శివాలయంలో జరుగుతున్న దేవి నవరాత్రుల ఉత్సవాలులో అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శివాలయం ఆవరణలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు చెరుకు శివకుమార్, అక్షయ్ కుమార్, కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్, తిరుపతయ్య, రాఘవేందర్, కోట్ల వెంకటేష్, మల్లేష్, కండె సుమన్, ఈశ్వరయ్య, శ్రీను, కంటే సాయి, దర్శన్, రమేష్, సురేష్, శ్రీధర్, సృజన, యాదమ్మ, భాగ్యమ్మ, సునీత, జయమ్మ, జానకమ్మ, మాధవి, సుమలత తదితరులు ఉన్నారు.

**వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో:**

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో హోమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వీరబ్రహ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బిక్కుమాండ్ల నరసింహ, మిట్టపల్లి అంజయ్య,ఉప్పల శివకుమార్, ప్రసాద్,ఆనంద్, పూజారులు సీనయ్య శర్మ, గిరీష్ శర్మ పాల్గొన్నారు.

**మార్కేండయ ఆలయంలో:**

శ్రీ భక్త మార్కండేయ దేవాలయం మార్కండేయ కొండపై వెలిసిన శ్రీదేవి నవరాత్రుల సందర్భంగా 8వ రోజు శ్రీ మహా దుర్గాదేవి దీపాలంకరణ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.మార్కండేయ సంఘం అధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, మాడిశెట్టి రవి, ఎంగలి రమేష్,శివకుమార్,శ్రీధర్, యాదగిరి, ఆంజనేయులు, వాసు, శ్రీను, సత్యరాములు, మహిళా సభ్యులు అలివేలు, శ్రీలత,ఉదయశ్రీ, ఎంగలి రమ్యశ్రీ, లీలావతి, సుజాత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.









# ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు

▸ **కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, విశాల భారతి:** ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో వివిధ గ్రామాల లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతు అనారోగ్యం కారణంగా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ చేయుతనిస్తుందని, నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్ధేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో మందికి ఆర్థికంగా చేదోడుగా నిలిచిందని అన్నారు. అర్హులైన వారందరికీ సీఎంఆర్ఎఫ్‌తోపాటు సంక్షేమ పథకాలు అందిస్తూన్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశంలో ఎక్కడలేని విధంగా మన రాష్ట్రంలో ప్రజలకు అవసరమయ్యే సంక్షేమ పథకాలను రూపకల్పన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక తెలంగాణ నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులకు దరఖాస్తు చేసుకోని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహా, సేవాదళ్ అధ్యక్షులు లక్ష్మయ్య, జిల్లా నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, కిసాన్ సేల్ అధ్యక్షులు బాలరాజు, టౌన్ వర్కింగ్ అధ్యక్షులు రామచందర్ నాయక్, జహంగీర్, జహంగీర్ బాబా, మల్లేష్ గౌడ్, యాదయ్య, బిక్షపతి, నరేందర్ తదితరులు పాల్గోన్నారు.



# వాసవి టెంపుల్ లో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

▸ **దుర్గాదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం**

**కల్వకుర్తి విశాల భారతి** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ఫౌండర్ ట్రస్ట్ జూలూరు రమేష్ బాబు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ అధ్యక్షతన ఉత్సవాలు కన్నుల విందుగా కొనసాగుతున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం 8వ రోజు అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయం ప్రాతః కాల పూజలతో మొదలుకొని అభిషేకం ప్రత్యేక పూజలు, దంపతులచే సామూహిక కుంకుమార్చనలు జరిపారు.7వందల మంత్రాలతో కూడిన చండీ సప్తశతిని పారాయణ చేసి చండీ హోమం నిర్వహించారు. దేశోపద్రవాలు శాంతించడానికి, గ్రహాల అనుకూలతకు, భయభీతులు పోవడానికి, శత్రు సంహారానికి, శత్రువులపై విజయం సాధించడానికి తదితర కారణాలతో చండీ యాగం చేస్తారు. వీటిలో నవ చండీ యాగం చేస్తే వాజపేయం చేసినంత ఫలం వస్తుందట. కావున భక్తులచే 40 మంది జంటలచే చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్ ఆలయంలో నిర్వహించిన చండీ హోమంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ, భక్తులకు బోజన ప్రసాదం ఏర్పాటు చేయడం జరిగింది. సాయంత్రం మహిళలచే దాండియా కోలాటాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంప శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నారాయణరాజు, దాచేపల్లి నితిన్ కుమార్, కోశాధికారులు పానుగంటి నవీన్, సంబు తరుణ్, వాస మనీష్, ఉత్సవ కమిటీ ముఖ్య సలహాదారులు దాచేపల్లి శ్రీనివాసులు, సంబు ముత్యాలు, వాస శేఖర్, గంధం కిరణ్ ప్రసాద్, గందె రవి, ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, అవోప అనుబంధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



# దసరా ఏర్పాట్లు పూర్తి

▸ **చైర్మన్ రాంపాల్**

**ఆమనగల్లు, విశాలభారతి :** ఆమనగల్లు పట్టణంలో విజయదశమి (దసరా ) వేడుకలకు సంబంధించి మున్సిపల్ శాఖ, పాలకవర్గం సహకారంతో ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ నేనావత్ రాంపాల్ నాయక్ తెలిపారు. ఆమనగలు పట్టణంలో అత్యంత వైభవంగా జరుపుకునే దసరా పండుగకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, పాలకవర్గం సభ్యులతో కలిసి చైర్మన్ రాంపాల్ నాయక్ ఏర్పాటను పరిశీలించారు. ప్రజలకు ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూడాలని, కళాశాల మైదానంలో పారిశుద్ధ్య పనులను చేయించారు. లైటింగ్, ఇతర ఏర్పాట్లను చైర్మన్ పరిశీలించారు.



# రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

▸ **బీసీ నేత ధనుంజయ నాయుడు హర్షం**

**పాలకీడు, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. గురువారం నాడు నేరేడుచర్ల సిపిఐ కార్యాలయం ప్రజా భవన్ నుంచి సిపిఐ మండల కార్యదర్శి యల్ల బోయిన సింహాద్రి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, బీసీ హక్కుల సాధన సమితి సభ్యుడు గుడిపాటి శ్రీహరితో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ ఒకే క్యాంపస్ లో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం అత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయడం అభినందించదగ్గ అంశమని అంతర్జాతీయ ప్రమాణాలతో 5వేల కోట్ల రూపాయలతో నిర్మాణం చేయడం రేవంత్ రెడ్డి పనితానికి నిదర్శమని ఆయన కితాబు ఇచ్చారు. అయితే ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో విధివిధానాలపై బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంఘాలు మరియు ప్రధాన రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో 56శాతం గా జనాభా ఉన్న బీసీలకు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల కంటే అధికంగా గురుకులాలు ఉన్నాయని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఎలా ఉంటుందో స్పష్టం చేయాలని అన్నారు.



## ఆయుధ పూజ నిర్వహించిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

- కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజ

**వనపర్తి, విశాల భారతి :** దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి అనుగ్రహంతో నిరంతరం ప్రజా సేవలో జీవించే జిల్లా పోలీసులకు విజయం వరించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆకాంక్షించారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా 8వ రోజు దుర్గాష్టమి రోజు విజయదశమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సాయుధ దళ పోలీసు కార్యాలయంలో ఎస్పీ దంపతులు సతిసమేతంగా జిల్లా పోలీసు ఆయుదాలకు, వాహనాలకు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విధి నిర్వహణలో పోలీసులు ఆయుధాలకు, వాహనాలకు, ఎలాంటి ఆటంకం లేకుండా ఉండాలని బ్రాహ్మణులు మంత్రోచ్చారణాలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..... శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాలను నియంత్రించడంలో జిల్లా పోలీసు శాఖ సఫలీకృతం అవ్వాలని, దుర్గా మాత కరుణ కటాక్షాలు జిల్లా పోలీసులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ పోలీసు ఆయుధాలకు వాహనాలకు పూజలు నిర్వహించడం జరిగింది. జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమసేవలు అందించి మంచిపేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు పోలీసువారిపై ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ ఆకాంక్షించారు.

అదేవిధంగా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లా పోలీసుఅధికారులకు, సిబ్బందికి, జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సాయుధ దళ అదనపు ఎస్పీ, వీరారెడ్డి , వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, సాయదదళ ఇన్స్పెక్టర్లు, శ్రీనివాస్, అప్పలనాయుడు, వనపర్తి సీఐ, నాగభూషణరావు, వనపర్తి పట్టణ ఎస్సైలు , జయన్న, రామరాజు, స్పెషల్ బ్రాండ్ ఎస్సైలు, నరేష్, శివ కుమార్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, సురేందర్, మగ్దూం బారి, సాయుధ దళ సిబ్బంది జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## గీతంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

**పటాన్ చెరు,విశాలభారతి:** 'పనిచేసే చోట మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం' ఇతివృత్తంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని' గురువారం నిర్వహించారు. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వృత్తిపరమైన వాతావరణంలో మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడం ప్రాముఖ్యతను చాటి చెప్పారు. మానసిక ఆరోగ్యం, దాని ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడానికి బృంద చర్చలు, వక్తృత్వ పోటీలు, విలువలను చాటి చెప్పే ప్రదర్శనలు ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ అంశంపై ఓ చలన చిత్ర ప్రదర్శనతో పాటు స్వాంతన చేకూర్చే మాటల పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వీటిలో పాల్గొన్న వారికి రోజువారీ జీవితంలో, ముఖ్యంగా కార్యాలయంలో మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతపై లోతైన అవగాహనను కల్పించారు. 'మానసిక స్థితిస్థాపకతను నిర్మించడం: కళాశాల నుంచి కెరీర్ కు పరివర్తనలో వృద్ధి చెందడం' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఉడాన్ కన్సల్టెంట్ డాక్టర్ ప్రియాంక శర్మ, ప్రముఖ బహుళజాతి సంస్థ కార్పొరేట్ సైకాలజిస్ట్ దేబన్ విట్టా కహలీ, గీతం అధ్యాపకులు ప్రొఫెసర్ డీఆర్ పీ చంద్రశేఖర్, డాక్టర్ సాకిబ్ ఖాన్, సుబ్బు పేటేటి, డాక్టర్ నవ్య సంకీర్తన, విద్యార్థిని దీక్షిత తదితరులు పాల్గొన్నారు. మానసిక ఆరోగ్యం గురించి బహిరంగ చర్చలను ప్రోత్సహించడం, ప్రతిష్టకు మచ్చతెచ్చే వాటిని ముందుగానే నివారించడం, వ్యక్తిగత, వృత్తిపరమైన కార్యకలాపాలలో ప్రజలు ఎదుర్కొనే మానసిక క్షేమ సవాళ్లను ప్రతిబింబించేలా ఇందులో పాల్గొనే వారిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు సాగాయి. వీటిని నిర్వహించడం ద్వారా, గీతం హైదరాబాద్ మానసిక ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత నిస్తూ, అందుబాటులో ఉన్న సహాయక వ్యవస్థలపై అవగాహన పెంచే ప్రపంచ ఉద్యమానికి తనవంతు చేయూతను అందించింది.



## ఆయుధ పూజ నిర్వహించిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

- కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజ

**వనపర్తి, విశాల భారతి :** దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి అనుగ్రహంతో నిరంతరం ప్రజా సేవలో జీవించే జిల్లా పోలీసులకు విజయం వరించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆకాంక్షించారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా 8వ రోజు దుర్గాష్టమి రోజు విజయదశమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సాయుధ దళ పోలీసు కార్యాలయంలో ఎస్పీ దంపతులు సతిసమేతంగా జిల్లా పోలీసు ఆయుదాలకు, వాహనాలకు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విధి నిర్వహణలో పోలీసులు ఆయుధాలకు, వాహనాలకు, ఎలాంటి ఆటంకం లేకుండా ఉండాలని బ్రాహ్మణులు మంత్రోచ్చారణాలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..... శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాలను నియంత్రించడంలో జిల్లా పోలీసు శాఖ సఫలీకృతం అవ్వాలని, దుర్గా మాత కరుణ కటాక్షాలు జిల్లా పోలీసులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ పోలీసు ఆయుధాలకు వాహనాలకు పూజలు నిర్వహించడం జరిగింది. జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమసేవలు అందించి మంచిపేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు పోలీసువారిపై ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ ఆకాంక్షించారు. అదేవిధంగా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లా పోలీసుఅధికారులకు, సిబ్బందికి, జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సాయుధ దళ అదనపు ఎస్పీ, వీరారెడ్డి , వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, సాయదదళ ఇన్స్పెక్టర్లు, శ్రీనివాస్, అప్పలనాయుడు, వనపర్తి సీఐ, నాగభూషణరావు, వనపర్తి పట్టణ ఎస్సైలు , జయన్న, రామరాజు, స్పెషల్ బ్రాండ్ ఎస్సైలు, నరేష్, శివ కుమార్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, సురేందర్, మగ్దూం బారి, సాయుధ దళ సిబ్బంది జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష సమావేశం

- పాల్గొన్న రాజకీయ నాయకులు, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** ఆదిభట్ల మున్సిపాలిటీలోని కొంగర కలాన్ లో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల లొకేషన్ల మార్పు, సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాల్లో 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వాటికి సంబంధించి సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయుటకు గుర్తించడం జరిగింది అని పార్టీల వారికి వివరించారు. ప్రతిపాదించిన సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, లొకేషన్ల మార్పు వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాల పై ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే తెలియజేయవలసిందిగా కోరారు. ఎటువంటి మార్పులు లేని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్, సిపిఐ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 'బతుకమ్మ' ప్రకృతిని ఆరాధించే పండుగ

- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్
- చిట్కుల్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- బతుకమ్మ ఆడిన నీలం మధు సతీమణి కవిత



**పటాన్ చెరు,విశాలభారతి**ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ అని కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం చిట్కుల్ గ్రామంలో జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మహిళలతో కలిసి నీలం మధు సతీమణి కవిత బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రమంతా గ్రామ గ్రామాన అక్క చెల్లెలు సంబరంగా నిర్వహించుకునే పూల పండగ బతుకమ్మ అని చెప్పారు. పూలనే దేవతగా కొలిచే గొప్ప సంస్కృతి, సాంప్రదాయం మన తెలంగాణకే దక్కిందన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుందనీ స్పష్టం చేశారు. మహిళలందరూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబరాలు జరుపుకోవాలని కోరారు. ఆ గౌరీ మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో పరిరవిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన డా.మౌలాలి దాసరి

- ఓయూ నుండి రెండు డాక్టరేట్స్ స్వీకరణ పలువురు ప్రశంసలు.

**సికింద్రాబాద్ ,విశాలభారతి:** నాగర్ కర్నూలు జిల్లాలోని బల్మూర్ మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన మౌలాలి దాసరి మొదటగా గురుకులలో టీజిటీ హిందీ ప్రభుత్వ ఉజ్యోగం సాధించి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల (బాలురు) అంబటిపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న రెండు నెలల్లోనే మరో ప్రభుత్వ ఉద్యోగం డిఎస్సీలో లాంగ్వేజ్ పండిట్ హిందీ ఉద్యోగం సాధించాడు. టీజీపీఎస్సీ పరీక్ష నిర్వహించిన మరో జెల్ ఉద్యోగం కోసం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకొని జాబ్ కోసం ఎదురుచూస్తున్నాడు. తెలంగాణ వచ్చిన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం లో పీహెచ్డీ లో రెండు డాక్టరెట్స్ సాధించినారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో జాబ్స్ నోటిఫికేషన్ ఇవ్వక నాలాంటి నిరుద్యోగులకు నిరాశ మిగిలిచింది. ప్రభుత్వం మారడం వలన ఒకే సంవత్సరం వివిధ నోటిఫికేషన్స్ రావడం మరియు ఒకే సారి రెండు ఉద్యోగాలు సాధించడం పట్ల అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



## నరేష్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసిన డా వివేక్

- ప్రజా నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరం.
- వారి అకాల మరణం రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు.
- కిసాన్ పరివార్ సీఈవో డాక్టర్ వివేక్.

**మరిపెడ, విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలంలో ప్రజా నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరం. కిసాన్ పరివార్ సీఈవో డాక్టర్ వివేక్ డోర్నకల్ నియోజకవర్గంలో పర్యటిస్తూ గత వారం రోజుల క్రితం గుండెజబ్బుతో చనిపోయిన డోర్నకల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు పేద ప్రజలను అభిమానించే, ప్రజల మన్ననలు పొందిన నరేష్ రెడ్డి మరణించిన విషయాన్ని తెలుసుకొని వారి స్వహగ్రం పురుషోత్తమగుడంలో చిత్రపటానికి పూలమాలవేసి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం డాక్టర్ వివేక్ మాట్లాడుతూ నరేష్ రెడ్డన్న అజాతశత్రువు కూడా తన తలుపులు తెరిచించే, నాయకుడు నరేష్ రెడ్డి , నేను చాలా సందర్భాల్లో ఇంటర్వ్యూలు చూడడం జరిగింది. మీరు లీడర్గా ఇష్టపడతారా, రాజకీయ నేతగా ఇష్టపడతారా, అని అంటే నేను ప్రజానేతగా ఇష్టపడతానని చెప్పిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి నాయకుడిని కోల్పోవడం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీరని లోటని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాను. ఈ కార్యక్రమంలో ఏడు మండలలా ఇన్చార్జులు మరిపెడ మండల ఇన్చార్జ్ వెంకన్న, వెంకటేశ్వర్లు,కురవి మండల ఇంచార్జ్ శివ వర్మ నాయక్ ,హరిబాబు, సిరోల్ మండల ఇన్చార్జ్ బానోతు విష్ణు, డోర్నకల్ మండలం ఇంచార్జ్ రామ్మూర్తి, తదితరులు భూపాల్ నాయక్, అభిమానులు పాల్గొనడం జరిగింది.

## దోపిడీకి గురవుతున్న పర్యావరణ సంపాదన

- పర్మిషన్ల పేరుతో దోపిడీ
- తెలిసి తెలియనట్టు ఎవరిస్తున్న అటవీ శాఖ అధికారులు



**నర్సింహులపేట, విశాలభారతి:** మండలంలోని ముంగిమడుగు రామన్నగూడెం గ్రామాలలో పర్మిషన్ల పేరుతో గత కొద్దిరోజుల నుండి కలప అక్రమ రవాణా జరుగుతుంది. కొన్ని రహస్య ప్రదేశాలలో డంపులుగా ఏర్పాటు చేసుకొని నిత్యం అక్రమణా రవాణా చేసుకుంటున్నారు విషయంపై స్థానిక ప్రజలు వివరణ కోరగా కాలం చెల్లిన పర్మిషన్ లెటర్లు చూపించుకుంటూ దోపిడిదారులు దోచుకుంటున్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని హరితహారం అంటూ ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేపడుతున్న కర్ర కట్టుకోవడానికి అటవీ శాఖ అధికారులు పర్మిషన్ ఇవ్వడం చర్చిని అంశంగా మారింది.



## తెలంగాణ సాంప్రదాయ సద్దుల బతుకమ్మ సంబరాలు

**దంతాలపల్లి, విశాలభారతి:** దొనకొండా గ్రామంలో బతుకమ్మ సంబురాలు చివరి రోజున తీరొక్క పూలను పేర్చి సద్దుల బతుకమ్మని ఘనంగా ఆడబిడ్డలు నిర్వహించారు.తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను ప్రతీకగా బతుకమ్మ పండుగను తొమ్మిదవ రోజు గురువారం సంబరాలు అంబరాన్ని అంటే విధంగా నిర్వహించారు. పలు గ్రామాలలోని మహిళలు బతుకమ్మ పండుగ సందర్భంగా ఒక్క పొద్దు ఉండి ఊరిలోని చెట్లనుండి తీరొక్క పూలను సేకరించి ఆ సేకరించిన పూలతో బతుకమ్మను పేర్చి, డప్పు చప్పులతో ఏర్పాటు చేసి ఊరేగింపుగా బతుకమ్మను గ్రామలలోని ప్రధాన చౌరస్తా వద్దకు చేరుకునిఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాలలోని పెద్దవారు బతుకమ్మ పండుగ దాని విశిష్టత గురించి ప్రతి ఒక్కరికి అర్థమయ్యే విధంగా వివరించారు. మహిళలు ఆనందంగా రాత్రంతా బతుకమ్మ ఆటపాటలతో నృత్యాలతో, చప్పట్లతో కోలాటాలతో సాంస్కృతిక సాంప్రదాయాలకు ప్రతీకగా మహిళలు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.



## బతుకమ్మ ఆట స్థలాలను సందర్శించిన మంత్రి

**సైదాపూర్, విశాల భారతి** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో గురువారం బతుకమ్మ ఆట స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దసరా ఉత్సవాలల్లో భాగంగా అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. దర్శనానంతరం మంత్రి మాట్లాడుతూ అమ్మవారి కటాక్షం రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దొంత సుధాకర్, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్,చాడ కొండల్ రెడ్డి,చిన్న వెంకటేశం,మునిగంటి సంతోష్,రాహుల్ ఎర్రల శ్రీనివాస్,రాజు,నవీన్,సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ



**వాజేడు,.విశాలభారతి:** మండల కేంద్రం, వివిధ గ్రామాలలో సద్దుల బతుకమ్మ పండుగ మహిళలు ఘనంగా నిర్వహించారు. ప్రకృతిలో వికసించే వివిధ రకాల పూలను సేకరించి మహిళలు రంగులతో అలంకరించి బతుకమ్మను పేర్చుకొని భక్తి శ్రద్ధలతో ఇంట్లో పూజలు నిర్వహించి ప్రతి ఇంట్లో ఆడబిడ్డగా భావించి పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా మల్ల ఏడు మరవక రావమ్మా అంటూ పాటలు పాడుకుంటూ కోలాటాలతో నృత్యం చేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



## వైభవంగా సద్దుల బతుకమ్మ

**కరకగూడెం, విశాలభారతి:** మండలంలో బతుకమ్మ చివరి రోజు అయినా సద్దుల బతుకమ్మ ఘనంగా నిర్వహించారు.తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ బతుకమ్మ. బతుకమ్మ పండుగ తొమ్మిదవ రోజు చివరి రోజు కావడంతో గురువారం రోజున మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటే విధంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలోని మహిళలు వేకువదామున లేచి బతుకమ్మ పండుగ సందర్భంగా ఒక్కపొద్దు ఉండి ఊరిలోని చెట్లనుండి తీరక పూలను సేకరించి ఆ సేకరించిన పూలతో అలంకారప్రాయంగా బతుకమ్మను పేర్చి డప్పు చప్పులతో డీజే బాక్సులను ఏర్పాటు చేసి ఊరేగింపుగా బతుకమ్మ గద్ద వద్దకు చేరుకొని ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాలలోని పెద్దవారు బతుకమ్మ పండుగ దాని విశిష్టత గురించి ప్రతి ఒక్కరికి అర్థమయ్యే విధంగా వివరించారు. మహిళలు ఆనందంగా రాత్రంతా బతుకమ్మ ఆట పాటలతో నృత్యాలతో కనువిందు చేసి అనంతరం సమీపంలోని చెరువులు, వాగులలో ఆ బతుకమ్మను నిమజ్జనం చేశారు. అనంతరం వారు చేసిన ప్రసాదాలని ఒకరివి ఒకరికి పంచుకుని వారి వారి ఇంటికి చేరుకోన్నారు.



## శంకర్ నాయక్ ను పరామర్శించిన కిసాన్ పరివార్ సీఈవో

**చిన్నగుడూరు, విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గం గత వారం రోజులు క్రితం భూపాల్ నాయక్ టీం చిన్నగూడూరు మండల ఇన్చార్జ్ శంకర్ నాయక్ మరిపెడ నుండి వరంగల్ ,వెళ్లే రహదారిపై ఇంటికి వెళ్తున్న సమయంలో ఆక్సిడెంట్ అవ్వడం జరిగింది. శంకర్ నాయక్ ఎడమ చేతికి మరియు తలపై స్వల్ప దెబ్బలు తాకడం వలన చికిత్స పొంది ఇంట్లో రెస్ట్ తీసుకుంటున్న సందర్భంగా ఈరోజు వారిని పరామర్శించి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. మెరుగైన చికిత్సకు అయ్యే ఖర్చులు మొత్తం నేనే భరిస్తానని హామీ ఇచ్చారు.వారితోపాటు టీం ఇన్చార్జిలు, మరిపెడ మండలం ఇంచార్జ్ ఎడెల్లి వెంకన్న, వెంకటేశ్వర్లు, సీరోల్ మండల ఇంచార్జ్ భానోత్ విష్ణు, డోర్నకల్ మండల ఇంచార్జ్ రామ్మూర్తి, కురవి మండల ఇంచార్జ్ శివవర్మ నాయక్, హరిబాబు, ఏడు మండలాల ఇన్చార్జిలు అందరూ పాల్గొన్నారు.

## ప్రాథమిక వైద్యశాలలో బతుకమ్మ సంబరాలు



**పినపాక, విశాలభారతి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యులు దుర్గ భవాని ఆధ్వర్యంలో తెలంగాణ ప్రముఖ పండుగ అయినటువంటి బతుకమ్మ వేడుకలు నృత్యాలతో పాటలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ వైద్యురాలు రేపాక సాత్విక, వైద్యురాలు సాహితీ, ఎంపీ బంజారా పి హెచ్ సి, వైద్యురాలు సంకీర్తన, అశ్వాపురం పి హెచ్ సి, వైద్యురాలు మధు, పి హెచ్ సి కారకగూడెం, జడ్పీ హెచ్ ఎస్ హెడ్ మాస్టర్ రమణ ముఖ్యఅతిథిగా హాజర అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ అనేది తెలంగాణ సంప్రదాయాల్లో ప్రముఖమైనది అని ఆమె అన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటి ఆడపడుచులు, ఆడబిడ్డలు జరుపుకునేది. తెలంగాణ ప్రతీకగా బతుకమ్మ నిలిచింది. ఆనాటి నుంచి ఈనాటి వరకు అయిన బతుకమ్మ అనేది తెలంగాణ సంప్రదాయాల్లో ప్రముఖమైనది ఆమె చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యక ర్తలు, 108 సిబ్బంది పాల్గొన్నారు.



## డ్యూటీ మీట్ పోటీల్లో మరిన్ని పతకాలు సాధించాలి

- ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

**కొత్తగూడెం, విశాలభారతి:** పోలీస్ డ్యూటీ మీట్లో భాగంగా ఈ నెల 3,4 తారీఖుల్లో జోనల్ స్థాయి పోటీలు వరంగల్ లో నిర్వహించారు. భద్రాద్రి జోన్లో గల నాలుగు జిల్లాలైన వరంగల్,భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం,మహబూబబాద్ జిల్లాల నుండి వివిధ విభాగాలలో పోటీలకు పోలీస్ అధికారులు మరియు సిబ్బంది హాజరయ్యారు. ఈ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 22 పతకాలు సాధించి జోనల్ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది.07 బంగారు పతకాలు,07 వెండి పతకాలు మరియు 08 కాంస్య పతకాలు సాధించి జిల్లాకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లాను రెండో స్థానంలో నిలిచే విధంగా కృషి చేశారు. ఈ నెల 8వ తేదీన పోటీలకు సంభందించి ఫలితాలను విడుదల చేసి విజయం సాధించిన అధికారులు మరియు సిబ్బందికి వరంగల్ సీపి అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్ ఇట్టి మెడల్స్ ను అందజేశారు. జోనల్ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన అధికారులు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా గురువారం నాడు ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిర్వహించే విధులు పట్ల తమ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు మరియు తమ ప్రతిభను చూపేందుకు ప్రతి యేటా జోనల్ స్థాయి రాష్ట్రస్థాయి ,. జాతీయస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలిపారు.ఈ నెల 13వ తేదీ నుండి హైదరాబాదులో జరగబోయే రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్ పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జిల్లాకు ఎక్కువ పతకాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు.




## ఉపాధ్యాయ నియామకాల్లో సత్తా చాటిన మండల వాసులు

**నడిగూడెం, విశాలభారతి:** తెలంగాణ ప్రజా ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో నడిగూడెం మండలంలోని కాగిత రామచంద్రపురం నడిగూడెం, రత్నవరం, శ్రీరంగాపురం గ్రామాలకు చెందిన మందడి చంద్రశేఖర్ రెడ్డి, బెల్లంకొండ నవీన్, దోసపాటి క్రాంతి, పందిరి కళావతి, పందిరి మల్లిక, కొణతం వంశీ రెడ్డి, కందిమల్ల రవి లు ఉపాధ్యాయ నియామకాల్లో సత్తా సాటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోవడంతో మండల వ్యాప్తంగా పలువురు అభినందించారు.



## విశ్వహిందూ పరిషత్ ప్రఖండ సమావేశం నిర్వహణ

**పినపాక, విశాలభారతి:** మండలలోని జానంపేట గ్రామంలో గురువారం ప్రఖండ సత్యాపన సమావేశ కార్యక్రమం నిర్వహించారు. కొత్త గుంపు శ్రీ సీతారామ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సత్యాపన, సమావేశం జరిగింది. ఈ సత్యాపన సమావేశంలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ వోరుగంటి సురేష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ గురించి హిందూ ధర్మం సనాతన ధర్మం గురించి తెలియజేయడం జరిగింది. మన పినపాక ప్రఖండ లో ఉన్న ప్రఖండ, గ్రామ కమిటీల స్థితి, నూతన గ్రామ కమిటీల నిర్మాణం, కార్య విస్తరణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి గంగాధరి సీత, కార్యదర్శి చిలక మారి లక్ష్మణ్, గ్రామ సభ్యులు, శ్రీ సీతారామాలయం కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

# సుస్థిర, సమగ్రాభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి, విశాల భారతి:** డిజిటల్ కార్డు ద్వారా సంక్షేమ పథకాల అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం లో ప్రజల సుస్థిర,సమగ్ర అభివృద్దే పరమావధిగా పాలన చేస్తున్నామని అన్నారు. గురువారం వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలలో ఎమ్మెల్యే, ఉమ్మడి మహబూబ్ నాగర్ డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పలు కార్యక్రమాల్లో కలిసి పాల్గొన్నారు. ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలో నూతన ప్రాథమిక వ్యవసాయ,సహకార పరపతి సంఘం కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. వెంకటాం పల్లి గ్రామంలో సాగర కమ్యూనిటీ భవనం ఆగరం గ్రామ ప్రాథమిక పాఠశాల నూతనంగా నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం రాయితీ సిలిండర్ల ధ్రువపత్రాలను పంపిణీ చేసారు. అంతకుముందు దేశంలో గొప్ప పరిశ్రామిక,సామాజిక వేత్త రతన్ టాటా ను కోల్పోవడం బాధకరమన్నారు. మృతి పట్ల నిమిషం మౌనం పాటించారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ .. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల సమగ్రాభివృద్దే పరమావధిగా పాలననందిస్తున్నామని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీని నెరవేరుస్తు సన్నవడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వనున్నామన్నారు. మహిళలను కోటీశ్వరూలుగా చేయాలనీ,మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా ఆదర్శ్ పాఠశాల పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతుల కల్పన లో మహిళలను భాగస్వాములను చేసామని,ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ భాధ్యత మహిళ సంఘాలకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, పెద్దమందడి సింగిల్ విండో అధ్యక్షులు మురలీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి సోలిపురం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య వెంకట్రావు, సాయి చరణ్ రెడ్డి, నియోజకవర్గ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లిలో బతుకమ్మతో చిన్నారి సాక్షి రవి చందర్



## బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచులకు మజ్జిగ పంపిణీ

- ఆర్టీసీ డ్రైవర్ వీరగొని శ్రీనివాస్ గౌడ్.

**సైదాపూర్, విశాలభారతి:**కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచులకు వీరగోని శ్రీనివాస్ ఆర్టీసీ డ్రైవర్ తమ వంతు బాధ్యతగా గంటల తరబడి బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచులకు తనవంతుగా ఏదైనా చేయాలనుకున్నాడు. సోమవారం గ్రామస్తులు శ్రీనివాస్ గౌడ్ ను అభినందించారు.



## పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు నివాళులు

**ఆమనగల్లు, విశాల భారతి :** పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ సంపద సృష్టించడమే కాక ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గొప్పవ్యక్తి అని కొనియాడారు. మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, ఆనంద్, వీరయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## బిఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తోలు రాము



**వనపర్తి, విశాల భారతి::** హైదరాబాద్ జిల్లా కేంద్రంగా బుధవారం ఓ ప్రయివేట్ బంకెట్ హాల్లో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్(BSF) తెలంగాణ రాష్ట్ర కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ మేరకు బిఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్(BSF) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తోలు రాముని నియమిస్తూ, బిఎస్ఎఫ్ వ్యవస్థాపకులు పిడమర్తి రవి రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ను నియామక పత్రాన్ని అందజేయడం జరిగింది. నియామక పత్రం అందుకున్న అనంతరం బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోలు రాము మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి ఉన్నతమైన భాధ్యత అప్పగించిన, బిఎస్ఎఫ్ వ్యవస్థాపకులు పిడమర్తి రవి కి బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బిఎస్ఎఫ్ బలోపేతానికై క్రమశిక్షణతో బహుజన విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా,ప్రభుత్వ విద్యా విధానం బలోపేతానికై, విద్యా కాషాయికరణకు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యామాలు చేపడతామని ఆయన తెలియజేశారు.



## ఆడబిడ్డలు ఆనందంగా జరుపుకునే పండగ బతుకమ్మ

- పులగం స్వాతి రాఘవ రెడ్డి

**సూర్యాపేట, విశాల భారతి** ఆడబిడ్డలు అనందంగా జరుపుకునే ప్రకృతి పండగ బతుకమ్మ పండుగని ఆరేగూడెం గ్రామ తాజా, మాజీ సర్పంచ్ పులగం స్వాతి రాఘవ రెడ్డి అన్నారు. గురువారం సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలలో భాగంగా వారి నివాసంలో బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాదిగా వస్తున్న తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. ఇంటిల్లిపాది ఏకమై ఊరువాడ ఒక్కచోట చేరి రంగురంగుల పూలను పేర్చి ఆడబిడ్డలు ఆనందం జరుపుకునే ప్రకృతి పండుగ బతుకమ్మ పండుగ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సద్దుల బతుకమ్మ పండుగ

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలోని బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు గునగపువ్వు, తంగేడు పువ్వు , రకరకాల రంగుల పూలతో పేర్చిన బతుకమ్మ ఇంటికి ఒకటి చొప్పున తీసి గాంధీ విగ్రహం వద్ద మహిళలందరూ గుమ్మిగుడి ఆటపాటలతో ఘనంగా బతుకమ్మ పండుగ నిర్వహించారు. మహిళలు ఎటువంటి ఇబ్బంది కలగకుండా బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువతులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







# తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేసిన లబ్ధిదారులు

- అసెంబ్లీలో ప్రస్తావిస్తాన్నాని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే వేముల
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం

**బాల్కొండ, విశాల భారతి** కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను బాల్కొండ నియోజకవర్గంలోని ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల మండలాలకు చెందిన లబ్ధిదారులకు మాజి మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ లబ్దిదారులకు బతుకమ్మ, దసర శుభాకాంక్షలు తెలిపారు. పేదింటి అడబిడ్డ పెళ్లికి ఆసరాగా ఉండటానికి తెలంగాణ తొలి సిఎం కేసిఆర్ కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం వేంటనే ఇవ్వాలని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తులం బంగారంతో లబ్దిదారుల దరికీ లాభం చేకూరుతుందిని తెలిపారు.

**తులం బంగారం ఇవ్వాలని డిమాండ్:** చాక్లెట్ ఇస్తా సప్పరియండి అనేలాగా రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు తియ్యని మాటలు చెప్పాడని లబ్దిదారులు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన లక్ష రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. ఇప్పుడు మాకు చెక్కులు ఇచ్చేసాక మళ్ళీ తులం బంగారం ఎక్కడ ఇస్తారని మహిళలు డిమాండ్ చేశారు. మీ తరపున అసెంబ్లీలో ప్రస్తావిస్తాను అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం:** ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం అందజేస్తామని ఇచ్చిన హామీ ఏమయ్యింది అని ప్రశ్నించారు. దాంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు అధికారంలో ఉన్నప్పుడు మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చారా అంటూ ప్రశ్నించడంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు వేదిక వద్దకు రావడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ెపోలిసులు చోరవ తిసుకొని వారిని శాంతింపజేశారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం రెడ్డి, కమ్మర్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య, డిసిసిబి డైరెక్టర్ శేఖర్ రెడ్డి,సోసైటి చైర్మన్లు,తహశీల్దార్లు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# దుర్గామాత మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే

**కాప్రా,విశాలభారతి:** మీర్పెట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కమ్యూనిటీ హాల్, హెచ్ బీ కాలనీ, మంగాపురం, ఓల్డ్ మీర్పేట్ కాలనీ, తిరుమలనగర్ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవీని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కాసం మహిపాల్ రెడ్డి, గుమ్మడి జంపాల్ రెడ్డి, రామ్మోహన్రావు, కోటిరెడ్డి, కృష్ణమూర్తి, చారి, రాజు, రాకేష్ గౌడ్, వేణు గౌడ్, శ్రీనివాస్, నవీన్ గౌడ్, కుమార్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సృష్టికి మూలం....శక్తి రూపం

- ప్రత్యేక పూజలు చేసిన మేయర్ తోటకూర అజయ్ యాదవ్.
- శ్రీ వైష్ణవి యువత అసోసియేషన్ ఆధ్వర్యంలో దీపాలంకరణ.

**మేడిపల్లి,విశాలభారతి:** సృష్టికి మూలం అమ్మవారని, శక్తి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో భాగ్యమని నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు.బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలోని శ్రీ వైష్ణవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, కార్పొరేటర్ చీరాల నరసింహ, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దీపాలంకరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దైవ చింతనతోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బోమ్మక్ బాలయ్య, తోటకూర రవీందర్ యాదవ్,నాయకులు దొంతర బోయిన కృపా సాగర్ ముదిరాజ్ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



# పట్వారీ శశిధర్ అధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కూకట్ పల్లి,విశాలభారతి:** దేవి శరన్నవరాత్రుల సంధర్భంగా పట్వారి శశిధర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. బుధవారం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పిజెఆర్ నగర్ లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో రంగు రంగుల పువ్వులను పొగుచేసి బొడ్డెమ్మలను అలంకరించి బతుకమ్మలను ఒకదగ్గర చేర్చి మహిళలు చిన్నారులు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ,దండియా ఆడుతూ సందడి చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, మాదాపూర్, హాఫీజ్ పెట్ కార్పొరేటర్ లు పాల్గొన్నారు.అనంతరం మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ పండగల గొప్పతనం తెలుపుతూ భవిష్యత్తు తరాలకు మన పాతతరం కట్టుబాట్ల ను అందించాల్సిన బాధ్యత మన పై ఉందని తెలిపారు.ఈ వేడుకల్లో పాల్గొన్న ఏ ఒక్కరికి కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం శశిధర్ మాట్లాడుతూ ఈ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు,మహిళలు,చిన్నారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# కూకట్ పల్లిలో వాడవాడలా ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**కూకట్ పల్లి, విశాలభారతి:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేలా కూకట్పల్లిలో బతుకమ్మ వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. చిన్న పెద్దలు అందరూ కలిసి రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాత కూకట్పల్లి లో ఆటపాటలతో వీధులన్నీ మార్మోగించారు.బతుకమ్మ అంటేనే కూకట్పల్లి కూకట్పల్లి అంటేనే బతుకమ్మ అన్నట్టుగా ఒకరికి మించి ఒకరు పోటాపోటీతో ఒక్కో బతుకమ్మ 5 అడుగుల నుంచి మొదలుకొని 12 అడుగుల వరకు బతుకమ్మలను అందంగా ముస్తాబు చేశారు. అనంతరం కూకట్పల్లిలోని వాడవాడలా వీధుల గుండారథాలపై కదిలి కూకట్పల్లి రంగధాముని చెరువుపై నిమర్జనానికి బయలుదేరాయి. ఈ సందర్భంగా కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,ఎమ్మెల్సీ నవీన్ రావు,వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్పల్లి మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు ల నివాసాలలో భారీ బతుకమ్మలకు అందంగా తీర్చిద్దారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ రావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు సద్దుల బతుకమ్మ దసరా శుభాకాంక్షలను తెలుగు రాష్ట్ర ప్రజలకు తెలిపారు.

# అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

**సైదాపూర్ విశాల భారతి** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం చివరి రోజైన సద్దుల బతుకమ్మ కావడంతో మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనగా.. మరోపక్క ఊరూవాడా పూలవనంలా మారిపోయింది. మహిళలు, యువతులు, చిన్నారుల ఆటపాటలతో మండల వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. అక్టోబర్ 2న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన



ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తున్నాయ








# ఎమ్మెల్యే జీఎంఆర్ అధ్వర్యంలో... ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- భారీ సంఖ్యలో తరలివచ్చిన మహిళలు
- అలరించిన జానపద గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రేలా రే రేలా గంగ, బిత్తిరి సత్తి

**పటాన్ చెరు,విశాలభారతి** పటాన్ చెరులో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని సాకి చెరువు కట్టపై గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో వేలాదిమంది మహిళలు తమ బతుకమ్మలతో హాజరయ్యారు. ప్రముఖ జానపద గాయని రేలారే రేలా గంగా ఆధ్వర్యంలోని బృంద సభ్యులు ఆలపించిన బతుకమ్మ గీతాలకు అనుగుణంగా మహిళలు బతుకమ్మ ఆడారు. బిత్తిరి సత్తి హాస్యం అందరినీ అలరించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ..ప్రపంచంలో ప్రకృతిని ప్రేమిస్తూ..పూలను పూజించే అరుదైన పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. గత 12 సంవత్సరాలుగా బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరి ఆనందంలో పాలుపంచుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఉత్తమ బతుకమ్మల కు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి 25 వేల రూపాయలు, ద్వితీయ బహుమతి 20 వేల రూపాయలు, తృతీయ బహుమతి 15 వేల రూపాయలును విజేతలకు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బల్దియా డిప్యూటీ కమిషనర్ సురేష్, పట్టణ పుర ప్రముఖులు, గూడెం కుటుంబ సభ్యులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# సంపూర్ణ ఆరోగ్యం ఉంటేనే జీవితాన్ని కొనసాగించగలం

**వనపర్తి, విశాల భారతి:** దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు తమ విధులతో పాటు, ఆరోగ్యం పైనా దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్లోని ప్రజావాణి హాలులో ఐ డి ఓ సి లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి జిల్లా వైద్య శాఖ అధికారి జయచంద్ర మోహన్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిఎంహెచ్ఓ జయ చంద్ర మోహన్ ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేసారు. ఆరోగ్యం, దాన్ని కాపాడుకోవాల్సిన ప్రాముఖ్యతను, జీవనశైలి, ఆహారపు అలవాట్లను తెలుపుతూ చక్కటి ప్రెజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. నిత్యం వ్యాయామం కోసం కొంత సమయాన్ని కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే మనం ఏదైనా చేయగలమని సూచించారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిత్య జీవితంలో ఉండే ఒత్తిడులను ఎదుర్కొనేందుకు ఆరోగ్యంగా ఉండటం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# వనపర్తిలో సందడి చేసిన జబర్ధస్త్ నటులు

- హాసిని లేడీస్ ఎంపోరియం షాపును ప్రారంభించిన సునామీ సుధాకర్
- భారీ సంఖ్యలో హాజరైన యువత

**వనపర్తి, విశాల భారతి ::** జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి జబర్దస్త్ సినీ నటులు సందడి చేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో పెట్రోల్ పంపు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన హాసిని లేడీస్ ఎంపోరియం షాపును జబర్ధస్త్ నటుడు సునామీ సుధాకర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్, కౌన్సిలర్ బ్రహ్మచారి సినీ నటులు శ్రీగిరి, దేవరాజ్ పాలమూరు, యాపర్ల రాంరెడ్డి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జబర్దస్త్ నటుడు సునామీ సుధాకర్ మాట్లాడుతూ... నేను కూడా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వాసినేనని, నన్ను అభిమానించి ఆదరిస్తున్న ప్రేక్షక దేవుళ్ళకు పాదాభివందనం చేస్తున్నానన్నారు. షాపు ప్రారంభోత్సవానికి రావాలని సినీ నిర్మాత రాచాల యుగంధర్ గౌడ్ ఫోన్ చేసి చెప్పిన వెంటనే బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికి అన్నీ వదులుకుని ఇక్కడికి వచ్చానని, ఇంత మంచి కార్యక్రమానికి మమ్మల్ని ఆహ్వానించిన రాచాల కు, షాపు నిర్వాహకురాలు ప్రియాంక కు ఘన స్వాగతం పలికిన వనపర్తి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. జబర్దస్త్ నటులు వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న యువత భారీ సంఖ్యలో హజరు కావటంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. అభిమానులు వారితో పోటీ పడి సెల్ఫీలు దిగారు.



# పేటలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**సూర్యాపేట, విశాలభారతి:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకలను సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘనంగా మహిళలు జరుపుకున్నారు. 44 వ వార్డులో చిన్న,పెద్ద తారతమ్యం లేకుండా బతుకమ్మలను రంగు రంగుల పూలతో అందంగా అలంకరించి అందరూ ర్యాలీగా సర్దుల చెరువు వద్దకు వెళ్లారు. బతుకమ్మ పాటలతో సందడి చేసి పూజలు నిర్వహించిన అనంతరం సద్దుల చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 44వ వార్డులో..



# ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

**భీమదేవరపల్లి,విశాలభారతి:** సద్దుల బతుకమ్మ సంబురాలలో మహిళలు గురువారం ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ ఉత్సవంలో మహిళలు పెద్ద ఎత్తున ఒకే చోట చేరి బతుకమ్మ ఆటపాటలతో పండుగ వైభవాన్ని చాటి చెప్పారు. తీరొక్క పూలతో ఆకట్టుకునేలా తయారుచేసిన బతుకమ్మల చుట్టూ చేరి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఆటపాటల అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గ్రామపంచాయతీ సిబ్బంది, పోలీస్ శాఖ రెవెన్యూ శాఖ ల సమన్వయంతోని చర్యలుచేపట్టారు.



ఎమ్మార్వో ఎంపీడీవో సిఐ ఎస్సై పంచాయతీ కార్యదర్శి

# ప్రజలు పోలీసులకు సహకరించాలి

- పాలకీడు ఎస్.ఐ లక్ష్మి నరసయ్య

**పాలకీడు, విశాలభారతి:** మండలంలోని ప్రజలు దసరా పండుగలకు బయటికి వెళ్ళేటపుడు మీ విలువైన వస్తువులని మీ వెంట తీసుకొని వెళ్ళండి. ఎట్టి ఎట్టి పరిస్థితులలో డబ్బులు గాని, బంగారం గాని, మీ వెంట తీసుకెళ్లండి లేదా బ్యాంకు నందు భద్రపరుచుకొని వెళ్ళండి. ఇంటి బయట గేటుకు తాళం దొంగ కి సింబల్ కనుక తాళం లోపలి వైపు వేసుకొనే విధంగా చుడండి. బయటికి వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా పక్కన వారికీ మరియు పోలీస్ వారికి సమాచారం ఇవ్వండి. ఇంటి చుట్టూ లైటింగ్ ఉండేవిధంగా చూసుకోండి. ఇంటి ఆవరణలో లో సి సి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకొని పోలీస్



వారికి సహకరించగలరు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపించినట్లు అయితే 100 కి డయల్ చేసి చెప్పగలరు. నేర నియంత్రణలో ప్రజలు, పోలీస్ వారికి సహకరించగలరని పాలకీడు ఎస్.ఐ లక్ష్మి నరసయ్య అన్నారు.

# వైభవంగా సద్దుల బతుకమ్మ








ఆమనగల్లు,విశాలభారతి: ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. తెలంగాణసంస్కృతి,సంప్రదాయాలకు ప్రతిరూపంగా నిలిచిన బతుకమ్మ పండగను మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఉంచి,కొత్తబట్టలు ధరించి గౌరమ్మకు మొక్కి.. ఆటపాటలతో 'వెళ్లి రావమ్మా 'బతుకమ్మ' అంటూ సాగనంపారు. బతుకమ్మ పాటలతో కొందరు..డీజే చప్పళ్లతో మరికొందరు ఆడిపాడుతూ మురిసిపోయారు.అనంతరం భా రీ ర్యాలీగా చెరువుల వద్దకు చేరుకొని బతుకమ్మలను నిమర్జనం చేసారు.

















# ఏజెన్సీలో కార్పో'రేట్ '

- ఏజెన్సీ చట్టాలను బేఖాతర్ చేసిన జీవి మాల్
- పార్కింగ్ సదుపాయం లేని మాల్ వ్యాపారం
- ప్రమాదం జరిగితే ఏ శాఖ బాధ్యత వహిస్తుంది.?
- అనుమతులు ఇచ్చిన అధికారులు ఎవరు..?

**మణుగూరు, విశాలభారతి:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రధాన రహదారి అశోక్ నగర్ లో కార్పొరేట్ సంస్థ అయినా జీవి మాల్ ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా అట్టహాసంగా ప్రారంభించడం జరిగింది. ఏజెన్సీ చట్టాలను కాపాడాల్సిన స్థానిక గిరిజన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జీవి మాల్ ను ప్రారంభించడం వెనకాల రహస్యం ఏమిటో అర్థం కాని పరిస్థితిలో ఉందని ఏజెన్సీలోని ఆదివాసీలు ప్రశ్నిస్తున్నారు.ఏజెన్సీ చట్టాలను బేఖాతర్ చేయకుండా జీవి మాల్ యాజమాన్యం ఇష్టానురీతిలో ప్రభుత్వ అధికారుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఏద్దేచ్ఛగా షాపును ప్రారంభించి వ్యాపారాలు చేయడం వెనకాల ఎవరి అండదండలు ఉన్నాయో అర్థం కాని పరిస్థితిలో ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.కనీసం షాపు ముందు పార్కింగ్ స్థలం కూడా లేదని,ప్రమాదవశాత్తు ఎవరికైనా ఏమైనా జరిగితే దీనికి ఎవరు బాధ్యులని పలువురు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు.కొంతమంది అధికారులను మచ్చిక చేసుకుని తూతూ మంత్రంగా జీవి మాల్ ను ప్రారంభించి ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి ధనార్జనే ధ్యేయంగా వ్యవహరించడం తగదని పలువురు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు.జీవి మాల్ యాజమాన్యానికి స్థానికంగా ఉన్న కొంత మంది బడా బాబుల అండదండలు ఉన్నట్లుగా వారికి స్థానిక ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందిస్తున్నట్లుగా పలువురు మేధావులు ఆరోపిస్తున్నారు.ఉన్న షాపులను నాశనం చేసి కార్పే'రేట్' షాపులు తెరవడం అభివృద్ధి అంటే అనేక సంవత్సరాల నుండి జీవన ఉపాధి లేక బ్రతకడం కోసం చిన్న చిన్న బట్టల షాపులు పెట్టుకొని వారి కుటుంబాలను పోషించుకుంటూ వందలాది మందికి ఉపాధి చూపిస్తున్న చిరు వ్యాపారుల పరిస్థితులు అగమ్య గోచరంగా తయారయ్యే పరిస్థితులు దాపురించాయి.చిరు వ్యాపారుల స్థితిగతులు స్థానిక ఎమ్మెల్యేకు కానీ బడా బాబులకు కనిపించడం లేదా అంటూ చిరు వ్యాపారులు మండిపడుతున్నారు.ఏళ్ల నుండి బట్టల షాపుల ఆధారంగా బ్రతుకీడుస్తున్న వారి సంగతి ఏమిటని చిరు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికే వ్యాపారాలు లేక మణుగూరు షాపుల యజమానులు ఐపి లు పెడుతున్నారని,చిరు వ్యాపారులను నమ్మి పెట్టుబడి పెట్టిన వారి పరిస్థితి ఏమిటో అర్థం గాని స్థితిలో ఉన్నారని పలువురు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. జీవీ మాల్ హడావుడికి బట్టల షాపుల యాజమాన్యం ఐపిలు పెట్టడం ఖాయమే అంటూ పలువురు చిరు వ్యాపారుల నోటవెంటా వినిపిస్తున్నట్లుగా పలువురు ఆరోపిస్తున్నారు.చిరు వ్యాపారులు ఐపి లు పెట్టకుంటే ఆత్మహత్యలే శరణ్యం అంటూ పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు.కొంత మంది బడా బాబుల చేతుల్లో మణుగూరు బందీ కానున్నట్లుగా పలువురు మేధావులు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు.జీవి మాల్ ముందు ట్రాఫిక్ ఇంత దారుణంగా ఆపేసినా నియంత్రణ చేసే దిక్కే లేదా అంటూ పలువురు ఆరోపిస్తున్నారు. వ్యవస్థలన్నీ జీ వి మాల్ వారికే దాసోహంగా వ్యవహరించడం వెనకాల ఏ బడా బాబుల హస్తాలు ఉన్నాయో అర్థం కాని పరిస్థితిలో ఉందని పలువురు మండిపడుతున్నారు.వేరే షాపుల్లో మిగిలిన, అమ్ముడు పోనీ పాత బట్టలు అన్నీ మణుగూరు షాపులో పెట్టి ఏజెన్సీ జనాన్ని నిండా ముంచడానికి సిద్ధంగా జీ వి మాల్ ఉందని ఆదివాసి సమాజం ఆరోపిస్తోంది. మణుగూరు ను జిల్లా చేయలేరు, రెవిన్యూ డివిజన్ చేయలేరు,కనీసం రాయి గూడెం బ్రిడ్జి తీసుకురాలేరు కానీ జీవి మాల్ తో మణుగూరును అభివృద్ధి చేస్తారంటూ స్థానిక బడా బాబులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని స్థానిక ఆదివాసి నాయకులు, అభ్యుదయవాదులు ప్రజాతంత్ర వాదులు మండిపడుతున్నారు. జీవి మాల్ యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరిస్తున్న మణుగూరు పెద్దల చిత్తశుద్ధికి సలాం చేయాలంటూ పలువురు ముక్తకంఠంతో మండిపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కార్పొరేట్ సంస్థ అయిన జీ వీ మాల్ ప్రారంభానికి ఏ నియమ నిబంధనల ప్రకారం ఏ అధికారులు అనుమతులు ఇచ్చారో వేచి చూడాలి మరి...





Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.